PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 19 | విజయవాడ, శనివారం 19 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 19 August 2023 | Rs

మిక్స్‌డ్ ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం



బాకు(టర్కీ): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక స్వర్ణ, మరో కాంస్య పతకం దక్కాయి. శుక్రవారం ఈషా సింగ్, శివ్ నర్వాల్‌లతో కూడిన భారత మిక్స్‌డ్ ఎయిర్ పిస్టల్ ద్వయం 16-10పాయింట్ల తేడాతో టర్కీకి చెందిన ఇలైదా తర్హాన్-యూసుఫ్ డికెక్‌లను చిత్తుచేసి భారత్‌కు తొలి బంగారు పతకాన్ని ఖాయం చేశారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈషా 290, నర్వాల్ 293పాయింట్లతో మొత్తం 583పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. టర్కీ 581పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాయి. చైనా, ఇరాన్ 580పాయింట్లతో 3వ స్థానంలో నిలిచి ఫైనల్లోకి ప్రవేశించాయి.



కాలాన్ని బంధించే కెమెరా

ప్రత్యేక కథనం జీవనలో...

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

- **34,122 సీట్ల కేటాయింపు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిసెట్-2023 కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. మొత్తం 34,122 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని పాలిసెట్ అడ్మిషన్ల కన్వీనరు చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 34,624 మంది ఆప్షన్లను ఎంపిక చేసుకున్నారని పేర్కొన్నారు. మొత్తం 88 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 10,456 సీట్లు, 181 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 23,666 సీట్లు భర్తీ జరిగిందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23లోపు ఆయా కళాశాలల్లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలని, ఆ రోజు నుంచే తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 82,729 సీట్లు ఉన్నాయని వివరించారు. మిగిలిన సీట్లను తుది విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

- **ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతోందని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సలహాదారు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే విషయంలో ఐదేళ్ల కాలపరిమితిని తొలగించి 2014 జూన్ 2 నాటికి వున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఎక్కువగా విద్యాశాఖ, మెడికల్‌శాఖలో వున్నారని తెలిపారు. దాదాపు 14 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కానున్నారని పేర్కొన్నారు. ఆర్‌టిసిలో 1500 కారుణ్య నియామకాలను భర్తీ చేసిందని అన్నారు. అలాగే విద్యుత్ ఉద్యోగులకు 8 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడాన్ని 30 వేలమంది విద్యుత్ ఉద్యోగులు స్వాగతిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 12వ పిఆర్‌సి కమిషన్‌ను ప్రభుత్వం నియమించిందని అన్నారు. రికార్డు స్థాయిలో రాష్ట్రంలోని 17 యూనివర్సిటీలలో రెండు వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుందన్నారు. ఎపిఎన్‌జిఒ మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

వివాహ రిజిస్ట్రేషన్ గడువు 6 నెలలకు పెంపు

- **సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 18 ఏళ్లలోపు బాల, బాలికలకు బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, అలాగే వివాహ రిజిస్ట్రేషన్‌కు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గడువును 6 నెలలకు పెంచే చట్ట సవరణ బిల్లును త్వరలో ప్రభుత్వం తీసుకురానున్నట్లు సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో బాల్య వివాహాల నియంత్రణకు చేపట్టనున్న ప్రచార కార్యక్రమానికి సంబంధించి ఇంటర్నల్ డిపార్టుమెంట్ల స్ట్రాటజీపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సిఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. మహిళా శిశుసంక్షేమం, సెర్ప్, విద్య, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. నూతన నిబంధనల ప్రకారం వివిధ స్థాయిల్లో చైల్డ్ మ్యారేజెస్ ప్రొహిబిషన్ అధికారులు (సిఎంపిఒలు)ను నియమించి వారికి కచ్చితమైన అధికారాలు ఇస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో సర్పంచ్ లేదా వార్డు కౌన్సిలర్ అధ్యక్షతన బాల్య వివాహాల నియంత్రణ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటుచేసి వాటిలో వార్డు సెక్రటరీ, విలేజ్, వార్డు రెవెన్యూ అధికారి, మహిళా పోలీస్, స్వయం సహాయక సంఘం సభ్యులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ఎన్‌జిఒలను సభ్యులుగా పెట్టి బాల్య వివాహాల నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉందని సిఎస్ వెల్లడించారు. ఏ గ్రామంలో బాల్య వివాహాలు జరిగితే సంబంధిత గ్రామ, వార్డు సెక్రటరీలను బాధ్యులను చేసి వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. చర్చిలు, మసీదుల్లో ప్రస్తుతం లైసెన్స్ కలిగిన పాస్టర్లు, ఖాజీల ఆధ్వర్యంలో వివాహాలు జరుగుతున్నాయని, అలాగే ఆలయాల ఇఒలు, కళ్యాణ మండపాల ఇన్‌ఛార్జులకు కూడా బాల్య వివాహాలు జరగకుండా సర్క్యులర్ ఆదేశాలు జారీ చేయాలని దేవాదాయశాఖ కమిషనరును సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, వైద్యారోగ్యశాఖ కమిషనరు జె నివాస్, సెర్ప్ సిఇఒ ఇంతియాజ్, దిశ ప్రత్యేక అధికారి పాలరాజు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి భావన పలువురు పాల్గొన్నారు.

వరల్డ్ టూరిజం మ్యాప్‌లో ఎపి

- **విజయవాడలో హయత్ ప్లేస్ హోటల్ ప్రారంభోత్సవంలో సిఎం**

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వరల్డ్ టూరిజం మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్‌ను నిలిపేందుకు ముందుకు వచ్చే ప్రతి సంస్థకు చేయూతనిచ్చి ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడ గుణదలలో నూతనంగా నిర్మించిన హయత్ ప్లేస్ హోటల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సిఎం జగన్ మాట్లాడుతూ.. ప్రసిద్ధిగాంచిన హోటళ్లు రాష్ట్రమంతటా రావాలని, వరల్డ్ టూరిజం మ్యాప్‌లో రాష్ట్రానికి ప్రత్యేకమైన స్థానం లభించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం మంచి టూరిజం పాలసీని తీసుకువచ్చామని, రాష్ట్రంలో హోటళ్లు స్థాపించే సంస్థలను ప్రోత్సహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఒబెరాయ్ హోటళ్లు మొదలుకొని నేడు ప్రారంభించిన హయత్ ప్లేస్ వరకు మొత్తం 11 పెద్ద సంస్థలు రాష్ట్రంలో తమ తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం మరో నలుగురికి స్ఫూర్తిని ఇవ్వాలని, అనేక మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం హోటల్ చైర్మన్ వీరస్వామి, హయత్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఏరియా ప్రెసిడెంట్ శ్రీకాంత్, చైర్మన్ వీరస్వామి తనయుడు కార్తీక్, ఈ ప్రాజెక్టులో మమేకమైన వారందరికీ సిఎం అభినందనలు తెలిపారు.



హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి

దేవినేని అవినాష్ ఇంటికి వెళ్లిన సిఎం

వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ కుటుంబ సభ్యులను సిఎం కలిశారు. హయత్ హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా గుణదల సెంటర్‌లోని అవినాష్ ఇంటికి ఆయన వెళ్లారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు.

నెలాఖరులో అసెంబ్లీ ?

- **సమన్వయం కోసం నోడల్ అధికారులు**

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నెలాఖరులో జరగనున్నాయని సమాచారం, ఈ వర్షాకాల సమావేశాలకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ సమావేశాల కొందరు అధికారులను నోడల్ అధికారులుగా నియమించనున్నారు. ప్రతి శాఖకు ఒక నోడల్ అధికారిని నియమించాలని సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇదే సమయంలో అన్ని శాఖల అధికారులు కూడా ఆదేశాలు వెళ్లాయి.

ఏ శాఖలో ఏ అంశాలు చర్చకు ఉన్నాయన్నది కూడా వివరాలు సిద్ధంచేయాలని సూచించింది. ఇదే సమయంలో గతం నుంచి సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి కూడా జవాబులు సిద్ధంచేయాలని అన్ని శాఖలను ప్రభుత్వం ఆదేశించింది.

202 ప్రశ్నలకుపైగానే

సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు ఇవ్వని సమాధానాలు వందల్లోనే ఉన్నాయి. ఒకే ప్రశ్నకు ఉభయ సభల్లోనూ సమాధానాలను అధికారులు దాటవేస్తున్నారు. అత్యంత కీలకమైన ప్రశ్నలకు కూడా సమాధానాలు రావడం లేదని సభ్యులు వాపోతున్నారు. మొత్తం మీద 37వ సెషన్ నుంచి 42వ సెషన్ వరకు పలు ప్రశ్నలకు సమాధానాలు రాలేదని ప్రభుత్వం గుర్తించింది. మొత్తం 202 ప్రశ్నలు సమాధానాలు లేనివిగా మిగిలిపోయాయి.

'సర్దుబాటు'లో అసంబద్ధాలు తొలగించాలి

- **జీతాల సమస్యను పరిష్కరించాలి**
- **నేడు డిఇఒ కార్యాలయాల వద్ద నిరసన : ఫ్యాప్టో**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల 'పని సర్దుబాటు'లో అసంబద్ధాలను తొలగించాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. బదిలీలు జరిగి మూడు నెలలు కాకుండానే మరలా ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఫ్యాప్టో చైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 జూన్‌లో బదిలీలు, రేషనలైజేషన్, ప్రమోషన్లు విద్యాశాఖ నిర్వహించిందని తెలిపారు. ఇందులో బదిలీ అయిన పది వేల మంది పైగా ఉపాధ్యాయులకు మూడు నెలలు కావొస్తున్నా జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల్లో రిలీవర్ రాని కారణంగా ఇప్పటికీ సుమారు 1000 మంది ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే విధులు నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చారని, దీనిని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. బదిలీల్లో సాంకేతిక సమస్యలు వల్ల కొద్దిమంది ఉపాధ్యాయులు ఇప్పటికీ పాఠశాలల్లో చేరకుండా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మరోపక్క పాఠశాలల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తూ విద్యా వ్యవస్థను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 117 జిఒ పేరుతో రేషనలైజేషన్ జరిగి మూడు నెలలు పూర్తికాకుండా మరలా వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయడం పట్ల తాము తీవ్ర అభ్యంతరాన్ని తెలుపుతున్నామన్నారు. పని సర్దుబాటు, జీతాల సమస్య, ఒత్తిడితో ఉపాధ్యాయులు బోధనపై కేంద్రీకరించలేకపోతున్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను పెద్దయెత్తున బదిలీ చేయడం సరికాదని పేర్కొన్నారు. పని సర్దుబాటు ప్రక్రియలో అసంబద్ధాలను తొలగించేవరకు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ, ప్రమోషన్లు అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని, జిఒ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ మేరకు శనివారం అన్ని జిల్లాల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఈ నెల 23న 12 గంటల ధర్నా చేపడతామని హెచ్చరించారు.

'కడప ఉక్కు' సాధనకు పోరాటమే మార్గం

- **మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్**

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధనకు పోరాటమే మార్గమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. కడప ఉక్కు సాధన కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో శుక్రవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గేయానంద్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కావలసిన ఇనుప ఖనిజం, సున్నపురాయి, నికెల్, డోలమైట్ తదితర మూలకాలు విస్తృతంగా దొరుకుతున్నాయని తెలిపారు. ఆర్‌టిపిపి నుంచి విద్యుత్, మైలవరం, గండికోట, బ్రహ్మసాగర్ నుంచి నీరు, ఎర్రగుంట్ల, పొద్దుటూరు, ముద్దనూరు ద్వారా రైలు మార్గం, కృష్ణపట్నం నుంచి ఓడ మార్గం రవాణా సౌకర్యం ఉందన్నారు. 2010లో బ్రాహ్మిణి స్టీల్‌కు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. రాజశేఖర్‌రెడ్డి మరణించడం, రాష్ట్రం విభజన జరగడం, ప్రభుత్వాలు మారడంతో బ్రాహ్మిణి స్టీల్‌కు రూ.1050 కోట్లు ఖర్చుపెట్టి ఎత్తేశారని తెలిపారు. కరువు తీవ్రంగా ఉన్న ప్రాంతం రాయలసీమలో భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమ ఒకటి కూడా లేదని, ఈ ప్రాంత అభివృద్ధికి కడప ఉక్కు పరిశ్రమ ప్రాణవాయువు లాంటిదని వివరించారు. కర్నూల్లో రాయలసీమ డిక్లరేషన్ పేరిట కడప ఉక్కు నిర్మిస్తామని బిజెపి రాష్ట్ర నాయకులు ప్రకటించారని, అదే బిజెపి పెద్దలు పార్లమెంటులో కడప ఉక్కు సాధ్యంకాదంటూ మోసం చేశారన్నారు. సెయిల్ చైర్మన్ కడప జిల్లాకు వచ్చి పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని, అప్పుడు మాత్రమే నిజాలు వెల్లడవుతాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ సాధన కోసం బిజెపితో పోరాడాలని పిలుపునిచ్చారు. సదస్సులో కడప ఉక్కు సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, రాజేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, రెబ్బా.నరసింహులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గేయానంద్

నియంత, పెత్తందారుపై పోరాడుతున్నాను

- **మళ్లీ మంగళగిరి నుండే పోటీ : లోకేష్**

ప్రజాశక్తి-మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఒక నియంత, పెత్తందారుడు, వైసిపి గోబెల్స్‌పై తాను పోరాడుతున్నానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. అడుగడుగునా నిరాధార ఆరోపణలు చేయడం.. నిరూపించమంటే తోక ముడవడం వైసిపికి బాగా అలవాటైందని, అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించానని చెప్పారు. వైసిపి నాయకులు, సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై వేసిన పరువు నష్టం దావా కేసులో శుక్రవారం మంగళగిరి కోర్టుకు లోకేష్ హాజరయ్యారు. కోర్టులో వాంగ్మూలం ఇచ్చిన తర్వాత విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజధాని ప్రాంతం కంతేరు వద్ద తనకు 14 ఎకరాల భూమి ఉందని అభియోగం చేసిన పోసాని లీగల్ నోటీసులు ఎందుకు తిరస్కరించారో చెప్పాలన్నారు. ప్రభుత్వంలో ఉన్న వీళ్లు దానికి సంబంధించిన ఆధారాలను ఎందుకు బయటపెట్టడంలేదని ప్రశ్నించారు. అందుకే పోసానిపై రూ. ఐదు కోట్లకు పరువునష్టం దావా వేశానని, ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేసేవారు ఎవరైనా వదిలిపెట్టేది లేదని అన్నారు. మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్‌కె ఎన్నికలకు ముందు కొండ, వాగు పోరంబోకు భూములు, ఇతర భూముల్ని రెగ్యులరైజ్ చేయించి, ప్రజలకు పట్టాలిప్పిస్తానని చెప్పిన హామీ ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. 2024లో మంగళగిరి నుంచే తాను తిరిగి పోటీచేస్తానని తెలిపారు. రాజధాని అమరావతి మొత్తం రిజర్వ్‌డ్ నియోజకవర్గాల పరిధిలోనే ఉందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల గురించి బహిరంగంగా చర్చించే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. 'థర్డ్ గ్రేడ్ సినిమాలు తీసే రామ్ గోపాల్‌వర్మకు అనుమతి ఇస్తారు.. ప్రజలకోసం పోరాడే తమపై మాత్రం ఆంక్షలా విధిస్తారా' అని అధికారులను ప్రశ్నించారు. పాదయాత్రలో వైసిపి ఎమ్మెల్యేల అవినీతి ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతున్నామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ పి అనురాధ, టి జానకి దేవి, నందం అబద్దయ్య, కాండ్రు శ్రీనివాసరావు, వి మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పొత్తులపై త్వరలో నిర్ణయం : పవన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

'మేము బిజెపితో కలుస్తామా.. టిడిపితో కలుస్తామా అన్న దానిపై చర్చలు జరుగుతున్నాయి. నేను పదేళ్ల రాజకీయంగా కష్టపడిన తర్వాతే ఈ రోజు ముఖ్యమంత్రి పదవికి సిద్ధమని చెబుతున్నా. వ్యక్తిగతంగా నా సభలకు లక్షలాది మంది వస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్న దానిపైన నేను చాలా కృషి చేస్తున్నా. భవిష్యత్తులో ఏయే పార్టీలు కలుస్తాయన్నది త్వరలోనే తెలియజేస్తా' అని జనసేన అధినేత వపన్ కల్యాణ్ అన్నారు. వారాహి విజయ యాత్ర మూడో విడత ముగిసిన నేపథ్యంలో శుక్రవారం విశాఖ బీచ్‌రోడ్డులోని అంబికా సీ గ్రీన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతం నుంచి మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం ఎంతగానో బాధించిందని తెలిపారు. ఉత్తరాంధ్రలో 30 వేల ఎకరాల భూములను వైసిపి వారు కొన్నట్టు తన వద్ద ఆధారాలున్నాయని ఆరోపించారు. వాటి వ్యాపారం కోసమే విశాఖను రాష్ట్ర ఆర్థిక రాజధానిగా చేస్తామంటున్నారని విమర్శించారు. విశాఖలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని ఆరోపించారు. ఎపి నేరాలకు నిలయంగా మారిందని విమర్శించారు. గ్రీన్ ట్రిబ్యునల్ మాటలను పట్టించుకోకుండా వైసిపి పాలకులు పర్యావరణాన్ని హరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ నాయకుడు కాదని.. వ్యాపారవేత్త అని విమర్శించారు. చెత్తపై యూజర్ ఛార్జీల కింద డబ్బులు వసూలు చేయడం దారుణమన్నారు. ప్రజా సంక్షేమంలో విఫలమైన వైసిపిని గద్దె దించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్‌పై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ప్రయివేటీకరణ కాకుండా కృషి చేస్తున్నానని, నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి సమస్యను వివరించారని తెలిపారు. స్టీల్ ప్లాంట్ విషయంలో వైసిపి ఏం సాధించిందో చెప్పాలని ప్రశ్నించారు. సేలం స్టీల్‌ప్లాంట్ విషయంలో అందరూ ఒక తాటిపైకి వచ్చారు కాబట్టే అక్కడ ప్రయివేటీకరణ సాధ్యంకాలేదని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ఎన్‌సిటిఇ డిప్యూటీ సెక్రటరీకి ఎన్‌బిడబ్ల్యూ

ప్రజాశక్తి-అమరావతి

గత ఆదేశాలకు అనుగుణంగా విచారణకు హాజరుకాని ఎన్‌సిటిఇ డిప్యూటీ సెక్రటరీ అరెస్టుకు హైకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. విచారణ హాజరీ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిప్యూటీ సెక్రటరీ దాఖలు చేసిన అఫిడవిట్‌ను జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తోసిపుచ్చారు. పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోని తమ బిఇడి కాలేజీల గుర్తింపును రద్దు చేయడాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపల్ హైకోర్టులో సవాల్ చేశారు. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ప్రాంతీయ డైరెక్టరు ఇచ్చిన కాలేజీ గుర్తింపు రద్దు ఉత్తర్వులపై అప్పిలేట్ అథారిటీ అధికారి డిప్యూటీ డైరెక్టరు వద్ద అప్పీల్ చేశారు. తమ వాదనలను పట్టించుకోలేదని కాలేజీ తరపున న్యాయవాది చెప్పారు. ఎన్‌సిటిఇ నోటీసు మాత్రమే ఇచ్చిందని, కాలేజీ వాదనలను పట్టించుకోలేదని హైకోర్టు గుర్తించింది. కాలేజీ అప్పీల్ దాఖలు చేసినా చేయలేదని ఎన్‌సిటిఇ డిప్యూటీ సెక్రటరీ తరపున న్యాయవాది చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 18న విచారణకు డిప్యూటీ సెక్రటరీ స్వయంగా రావాలన్న గతంలో ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ విచారణకు హాజరుకాలేదు. హాజరీకి మినహాయింపు ఇవ్వాలని ఐఎ దాఖలు చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. డిప్యూటీ సెక్రటరీకి ఎన్‌బిడబ్ల్యూ జారీ చేసింది.

కేంద్రం కుట్రలను తిప్పికొడతాం

- **విశాఖ ఉక్కుపరిరక్షణ పోరాట కమిటీ**

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటువారికి అమ్మేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 918వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను విభాగాల వారీగా ప్రయివేటీకరించేందుకు టెండర్లు పిలవడం, ప్రధాన విభాగాలలో ఉత్పత్తిని గణనీయంగా తగ్గించే చర్యలు చేపట్టి నష్టాలు వచ్చేలా చేస్తుండడం దారుణమన్నారు. నష్టాలను సాకుగా చూపిస్తూ ప్లాంట్‌ను అమ్మేసే కుట్ర జరుగుతోందని తెలిపారు. కార్మికులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సైతం ఇవ్వకుండా ఉక్కు యాజమాన్యం దుర్మార్గమైన వైఖరి అవలంబిస్తోందని తెలిపారు. సకాలంలో రా మెటీరియల్‌ను కూడా ప్లాంట్ యాజమాన్యం కొనుగోలు చేయడం లేదని తెలిపారు. త్యాగాలు, పోరాటాల ద్వారా ఏర్పాటైన ప్లాంట్‌ను నిర్వీర్యపరిచేందుకు చేస్తోన్న కుట్రలను పోరాటాలతో అడ్డుకుంటామన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు సత్యనారాయణ, కెవి.రత్నం, ఎ.వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగన్ తీరని అన్యాయం చేశారు

- **టిడిపి టికెట్ ఇస్తే ఎమ్మెల్యేగా గెలుస్తా : యార్లగడ్డ**

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)



టిడిపిలో చేరేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కార్యకర్తల సాక్షిగా కోరుతున్నా, గన్నవరం టిడిపి టికెట్ ఇస్తే గెలిచి చూపిస్తా అని వైసిపి నేత యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కృష్ణా జిల్లా కానూరులోని యార్లగడ్డ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం తన అనుచరులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో రాజకీయ భవితవ్యంపై ఆయన మీడియాతో మాట్లాడారు. గన్నవరం అభ్యర్థిగా తాను పనికొస్తానని భావిస్తే టికెట్ ఇవ్వాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి తనకు తీరని అన్యాయం చేశారన్నారు. వైసిపిలో తనకు తగిన గుర్తింపు ఇవ్వకపోయినా ఏనాడు బాధపడలేదని, పార్టీ కోసం కష్టపడి పని చేసిన తన లాంటి వాడిని ఉండాలనుకుంటే ఉండు, లేకపోతే వెళ్లిపో అని సజ్జల వంటి నేత అనడం చాలా బాధగా ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన తనకు ఇలాంటి దుస్థితి వస్తుందని ఏనాడు ఊహించలేదని తెలిపారు. ఇప్పటి వరకు తాను చంద్రబాబునాయుడు, లోకేష్, దేవినేని ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌లను కలవలేదని స్పష్టం చేశారు. వారితో భేటీ అయ్యానని ఇంటిలిజెన్స్ రిపోర్టు ఉంటే తెప్పించుకుని పరిశీలించుకోవాలని తెలిపారు. బలాబలాలను బట్టి టికెట్ వస్తుందని వైసిపిలో కొందరు పెద్దలు మాట్లాడటం చేస్తే విచిత్రంగా ఉందన్నారు. 2018లో సరిపోయిన నా బలం ఇప్పుడు ఎందుకు బలహీనపడిందో పార్టీ పెద్దలే సమాధానం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి టికెట్ ఇస్తే ఎమ్మెల్యేగా గెలిచి కానుకగా ఇస్తా, జగన్‌మెహన్‌రెడ్డిని కలుస్తా అని వ్యాఖ్యానించారు.

చంద్రబాబు హయాంలోనే విశాఖ విధ్వంసం

- **యార్లగడ్డ ఆరోపణలు తప్పు : సజ్జల**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న 2014 నుంచి 2019 మధ్య కాలంలోనే విశాఖపట్నంలో ఎక్కువగా విధ్వంసం చోటుచేసుకుందని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక విశాఖలో చంద్రబాబు తప్పిదాలను సరిచేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని తన ఛాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పనిగట్టుకుని విశాఖపై క్రైమ్ రేట్ పెరిగిందని విషం చిమ్ముతున్నారని విమర్శించారు. విశాఖపట్నంకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు 2047 విజన్ హాస్యాస్పదంగా వుందని విమర్శించారు. యార్లగడ్డ వెంకట్రావ్ ముందే ఒక నిర్ణయం తీసుకున్నట్లు కనబడుతోందని అన్నారు. పార్టీ అన్నాక సమస్యలు వుంటాయని, అవి ఇంటర్నల్‌గా మాట్లాడుకోవాలి తప్ప బహిరంగంగా మీడియాతో మాట్లాడటం సరైంది కాదని పేర్కొన్నారు. పార్టీలో వుంటే వుండు లేదంటే వెళ్లిపో అని తాను అన్నట్లు యార్లగడ్డ చెప్పడం సరికాదన్నారు. తను అలా ఎందుకు అంటానని పేర్కొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనలో వైఫల్యం

- **నెల్లూరు కార్పొరేషన్ ఎదుట సిపిఎం మహాధర్నా**
- **ముగిసిన పోరుయాత్ర**

ప్రజాశక్తి-నెల్లూరు

మౌలిక వసతుల కల్పనలో సర్కారు విఫలమైందంటూ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. సిపిఎం ప్రజా పోరుయాత్ర ముగింపు సందర్భంగా బారాషాహీద్ గ్రౌండ్స్ నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మహాధర్నా చేశారు. కమిషనర్ వచ్చి సమాధానం చెప్పాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కమిషనర్ కార్యాలయంలోనికి వెళ్లనీవ్వకుండా సిపిఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. మేయర్ బయటకు వచ్చి సిపిఎం నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సిపిఎం ప్రజా పోరుయాత్రలో ప్రజలందరినీ కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. 28వ వార్డులో మంచినీళ్లురావడం లేదని, దోమలు విజృంభిస్తున్నాయని, డయేరియా, విష జ్వరాలతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేయర్ హామీతో మహా ధర్నా కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు షేక్ మస్తాన్‌బీ, పి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు సజావుగా జరపండి

- **ఎస్ఇసికి అచ్చెన్నాయుడు లేఖ**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పటిష్టమైన పోలీస్ భద్రత, సిసి కెమెరాలతో పర్యవేక్షణ ఏర్పాటుచేసి శనివారం పంచాయతీ ఎన్నికలు సజావుగా జరపాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు శుక్రవారం లేఖ రాశారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల కార్యక్రమం బలవంతపు ఏకగ్రీవాలు, అభ్యర్థులను కిడ్నాప్ చేయడం, అధికారులు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా తప్పుకుని తిరగడం వంటి లోపాలతో నడిచిందని విమర్శించారు. గ్రామ వలంటీర్లు రాజకీయ పార్టీలకు అనుకూలంగా రాజకీయ ప్రచారం చేపట్టడం వంటి అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు గతంలో లాగా చట్ట వ్యతిరేకంగా నిర్వహించడాన్ని ఎన్నికల కమిషన్ నిరోధించాలని డిమాండ్ చేశారు.

ఇసుక దోపిడీలో మునిగితేలుతున్న జగన్ : ధూళిపాళ్ల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇసుక దోపిడీలో మునిగి తేలుతున్నారని టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023 మే నాటికి జెపి వెంచర్స్ సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ముగిసినా యథేచ్ఛగా ఇసుక దోపిడీ కొనసాగుతోందని విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి నోరు విప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియాలో సజ్జల కుమారుడు పేరు వినిపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని టిడిపి అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ విమర్శించారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 43 సంచిక : 19 | విజయవాడ, శనివారం 19 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 19 August 2023 | Rs

ఎవరిని కదిలించినా కన్నీళ్లే !

- ఏచూరి నేతృత్వంలోని సిపిఎం బృందం తొలిరోజు పర్యటనలో దృశ్యాలు
- బాలింతలకు సౌకర్యాలు కరువు
- ఆ శిశువులే వారి ఆశాదీపాలు

లోపలి పేజీలో..



చంద్రుడిపై పలు బిలాలు !

- జాబిల్లిపై రెండు వీడియోలు విడుదల చేసిన ఇస్రో

లోపలి పేజీలో..

మళ్లీ పేలిన గుజరాత్ బుడగ

38 శాతం మందికి పోషకాహార లోపం

- గృహవసతికి దూరంగా 23 శాతం మంది
- నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి
- ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ కంటే దారుణం



న్యూఢిల్లీ : బిజెపి గొప్పగా ప్రచారం చేసుకునే గుజరాత్ మోడల్ బుడగ మరోసారి పేలిపోయింది. ఎంతో అభివృద్ధి చెందిందని, పేదల సంఖ్య భారీగా తగ్గిందని కాషాయ దళాలు ఎంతో ఆర్భాట ప్రచారపటాటోపం చేసే గుజరాత్ రాష్ట్ర జనాభాలో 38 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని నీతి అయోగ్ తాజాగా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. పోషకాహార రంగంలో ఆ రాష్ట్రం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సిఉందన్నారు. నీతి ఆయోగ్ విడుదల చేసిన జాతీయ బహుముఖ పేదరిక సూచిక (నేషనల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ –ఎంపిఐ) నివేదిక ప్రకారం గుజరాత్ జనాభాలో 38.09 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. గుజరాత్ గ్రామీణ జనాభాలో దాదాపు సగం మంది (44.45 శాతం), పట్టణ ప్రాంతాల్లో 28.97 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వెనుకబడిన రాష్ట్రాలుగా భావించే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు పౌష్టికాహార రంగంలో గుజరాత్ కంటే మెరుగ్గా ఉండటం గమనార్హం. ఇదొక్కటే కాదు మిగిలిన అనేక అంశాల్లో కూడా గుజరాత్ రాష్ట్ర తీరు ఆందోళన కరంగా ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) 5 డేటా ప్రకారం ఎదుగుదల లేని పిల్లల విషయంలో గుజరాత్ నాల్గవ స్థానంలో ఉంది. రాష్ట్రంలోని 39 శాతం మంది పిల్లలు తమ వయసుకు ఉండాల్సిన బరువు కంటే తక్కువగా ఉన్నారు. బలహీన (చైల్డ్ వేస్టింగ్), వయసుకంటే తక్కువ బరువు ఉన్న పిల్లల విషయంలో గుజరాత్ 25.1 శాతం, 39.7 శాతంతో రెండవ స్థానంలో ఉంది. ఆరోగ్య ప్రమాణాల పరంగా గుజరాత్ రాష్ట్రం యొక్క పేలవమైన పనితీరును ఇది ప్రదర్శిస్తుంది. (చైల్డ్ వేస్టింగ్ అనేది పిల్లలు తమ పొడవు కంటే చాలా సన్నగా, బలహీనంగా ఉండడాన్ని సూచిస్తుంది. ఇటీవలి కాలంలో వేగంగా బరువు తగ్గడం లేదా బరువు పెరగడంతో ఇది సంభవిస్తుంది. చైల్డ్ వేస్టింగ్‌తో మరణాలు సంభవించే ప్రమాదం కూడా ఉంది, కానీ చికిత్సతో దీనిని నివారణ సాధ్యమే). నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం గుజరాత్‌లో 23.30 శాతం జనాభాకు గృహ వసతి లేదు. ఈ విషయంలో గుజరాత్ కంటే కేరళ, పంజాబ్, తమిళనాడు మెరుగ్గా ఉన్నాయి. గుజరాత్ గ్రామీణ జనాభాలో 35.52 శాతం మంది గృహనిర్మాణానికి దూరంగా ఉన్నారని, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని నివేదిక తెలిపింది. పేదరికం విషయానికి వస్తే, గుజరాత్‌లో బహుముఖ పేదల సంఖ్య ఎన్ఎఫ్‌హెచ్ఎస్ సర్వేల మిగతా 7లో



దేశంలో తొలి '3డి పోస్టాఫీస్' ప్రారంభం

బెంగళూరు: దేశంలోనే తొలి 'త్రీడీ ప్రింటెడ్' పోస్టాఫీసు అందుబాటులోకి వచ్చింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో నిర్మించిన ఈ తపాలా కార్యాలయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. నిర్మాణ పనులు సాగిన తీరు, కార్యాలయంలోని సౌకర్యాలను చూపుతోన్న ఓ వీడియోను ఆయన ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 'త్రీడీ పోస్టాఫీసు'పై స్పందిస్తూ.. ప్రతి భారతీయుడు దీన్ని చూసి గర్వపడతారని పేర్కొన్నారు. ఇక్కడి కేంబ్రిడ్జ్ లేఅవుట్‌లో 1021 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీని నిర్మాణం చేపట్టారు. ఆధునిక 'త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ' సాయంతో కేవలం 45 రోజుల వ్యవధిలోనే పనులు పూర్తి చేయడం విశేషం. మద్రాస్ ఐఐటి సాంకేతిక సహకారంతో ఎల్‌టి సంస్థ దీన్ని నిర్మించినట్లు తెలిపారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్మతో బృందాకరత్ భేటీ

మణిపూర్‌పై జోక్యం చేసుకోండి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు ఐద్వా వినతి
- సిఎం బీరెన్ సింగ్‌ను తొలగించాలి
- మతృదేహాల కోసం కుటుంబాలు ఎదురు చూపులు
- మణిపూర్ ఘటనల పట్ల రాష్ట్రపతి విచారం
- సహాయక శిబిరాల్లో నెలకొన్న దుస్థితిపై ఆందోళన

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

"మణిపూర్ ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు న్యాయం చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వానికి తెలియజేయడానికి మీరు అధికారాన్ని ఉపయోగించాలి" అని రాష్ట్రపతి ద్రౌపది ముర్మను ఐద్వా అభ్యర్థించింది. శుక్రవారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మను ఐద్వా నాయకులు బృందాకరత్, ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పికె శ్రీమతి టీచర్, మరియం ధావలే శుక్రవారం కలిశారు. మణిపూర్‌లో తమ పర్యటన అంశాలను వివరిస్తూ, వినతి పత్రాన్ని రాష్ట్రపతికి బృందాకరత్ అందజేశారు. లైంగిక వేధింపులు, ఇతర హింస బాధితులపై జరిగిన క్రూరత్వాల వివరాలను రాష్ట్రపతి విన్నారని, ఈ ఘటనలపై ఆమె విచారం వ్యక్తం చేశారని బృందాకరత్ తెలిపారు. తాను గవర్నర్‌తో పలుమార్లు మాట్లాడినట్లు రాష్ట్రపతి చెప్పారని, సహాయక శిబిరాల్లో నెలకొన్న దుస్థితిపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు.

మణిపూర్ ప్రజల వాణిని నివేదిస్తున్నాం

"ఆగస్ట్ 9–11 అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తరపున మా మూడు రోజుల పర్యటనలో మణిపూర్ బాధితులు వెళ్లబోసుకున్న గోడును మీ దృష్టికి తీసుకొస్తున్నాం. అత్యాచార, లైంగిక వేధింపులకు గురైన మహిళలతో పాటు హింసను ఎదుర్కొంటున్న కుటుంబాలను కలుసుకున్నాం. వారు తమ అభద్రతా భావాన్ని, నిరాశను మీకు తెలియజేయాలని మమ్మల్ని అభ్యర్థించారు. మేము కలిసిన గవర్నర్ అనసూయ ఉయికే చాలా మంది బాధితులతో నేరుగా మాట్లాడారని, సంబంధిత అధికారులకు ఆమె సూచనలు చేసినా ఫలితం మిగతా 7లో



రాజమహేంద్రవరం దానవాయిపేటలో రోడ్డు కడ్డంగా పడిపోయిన వృక్షం

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో 22 వరకూ వానలు

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దంటూ వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాశక్తి- యంత్రాంగం

వాయువ్య బంగాళాఖాతం, దాని పరిస రాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం శుక్రవారానికి బెంగాల్, ఉత్తర ఒడిశా తీరాల పరిసరాలకు విస్తరించింది. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. పలుచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. గడిచిన 24 గంటల్లో తూర్పుగోదావరి జిల్లాలో 19.4 మిల్లీమీటర్లు, ఏలూరు జిల్లాలో 12.2, కాకినాడ జిల్లాలో 5.5, పశ్చిమగోదావరి జిల్లాలో 4.3, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 3.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విడత విడతలుగా కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెయిన్ రైల్వే స్టేషన్ రోడ్డు, శ్యామలా సెంటర్, ఆర్‌టిసి కాంప్లెక్, హైటెక్ బస్టాండ్, జెఎన్ రోడ్డు, కంబాల చెరువు మిగతా 7లో

మణిపూర్‌లో మళ్లీ హింస

- ముగ్గురు కుకీల దారుణ హత్య
- నాగా ఆధిపత్య జిల్లాలో తొలి దాడి

ఇంఫాల్ : మణిపూర్‌లో మరో ఘాతుకం చోటుచేసుకుంది. డబుల్ ఇంజన్ ప్రభుత్వాల వైఫల్యంతో మే 3న రాష్ట్రంలో ప్రారంభమైన హింసాకాండ రోజురోజుకూ విస్తరిస్తోంది. కొత్త ప్రాంతాల్లోనూ దాడులు జరుగుతున్నాయి. తాజాగా నాగా ఆధిపత్య జిల్లా ఉఖ్రూల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ముగ్గురు కుకీలను దారుణంగా హత్య చేశారు. హింసాకాండ ప్రారంభమైన తరువాత నాగా ఆధిపత్య జిల్లాలో ఇలాంటి దాడి జరగడం ఇదే మొదటిసారి. థవై కుకీ గ్రామంపై ఉదయం 4.30 గంటల సమయంలో గుర్తు తెలియని కొందరు సాయుధ దుండగులు దాడి చేశారు. ముగ్గురు గ్రామ వాలంటీర్లను దారుణంగా హత్య చేసి, మృతదేహాలను ఛిద్రం చేశారు. మృతదేహాలపై బుల్లెట్ గాయాలతోపాటు పదునైన ఆయుధాలతో దాడి చేసిన గుర్తులు కూడా ఉన్నాయి. మృతుల్ని థంగ్కోకై హాకిప్ (31), జాంఖోగిన్ హాకిప్ (35), హోలెన్‌సన్ బైతి (20)గా గుర్తించారు. మెయితీలే ఈ దాడికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నట్లు ఉఖ్రూల్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నింగ్‌షెమ్ వాషుమ్ మీడియాకు తెలిపారు. కాల్పులు జరిగిన వెంటనే ఆర్మీ, పోలీసు బలగాలు ఆ ప్రాంతానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టాయన్నారు. ఈ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో చెక్‌పోస్టు ఉందని తెలిపారు. కాల్పుల శబ్దం అనంతరం సమీప ప్రాంతాల్లో వెతకగా, ముగ్గురు వాలంటీర్ల మృతదేహాలు కనిపించాయని కుకీలు తెలిపారు.

మెయితీల ఒత్తిడితోనే భద్రతా సిబ్బంది తొలగింపు

కొన్ని రోజుల క్రితమే ఈ గ్రామం నుంచి అస్సాం రైఫిల్స్‌కు చెందిన శిబిరాన్ని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి భద్రతా సిబ్బంది లేరు. గ్రామంలో గతంలో ఎలాంటి దాడులు జరగకపోయినా ముందు జాగ్రత్తగా చర్యగా కుకీలు భద్రతను ఏర్పాటు చేసుకున్నారు. కుకీలకు చెందిన వ్యక్తులే గ్రామ వాలంటీర్లుగా ఏర్పడి రక్షణ బాధ్యతలు నిర్వహించుకుంటున్నారు. మెయితీల నుంచి వచ్చిన ఒత్తిడితోనే గ్రామం నుంచి భద్రతా సిబ్బందిని తొలగించారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నాగాలు అధికంగా ఉన్న ఈ జిల్లాలో 14 కుకీ గ్రామాలు ఉన్నాయి. హింసాకాండ నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన కుకీ మహిళలు, చిన్నారులు ఈ గ్రామాల్లో తలదాచుకుంటున్నారు. హింసను నియంత్రించడంలో విఫలమైన బీరేన్‌సింగ్ వెంటనే రాజీనామా చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అడ్డగోలు అదనపు ఛార్జీలు వద్దు

- రుణాలు చెల్లించలేని వారికి ఊరట
- బ్యాంక్‌లకు ఆర్‌బిఐ కొత్త మార్గదర్శకాలు

లోపలి పేజీలో..

వరల్డ్ టూరిజం మ్యాప్‌లో ఎపి

- విజయవాడలో హయత్ ప్లేస్ హోటల్ ప్రారంభోత్సవంలో సిఎం

ఆ పథకాలు పునరుద్ధరించాల్సిందే

పాడేరులో పివిటిజిల ర్యాలీ, ఐటిడిఎ ఎదుట బైఠాయింపు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మునుపటి పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయడంపై పివిటిజిలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం పాడేరు ఐటిడిఎ ఎదుట ఆందోళనకు దిగారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, ట్రైకార్, ఐకెపి ద్వారా 90 శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం 'చలో ఐటిడిఎ పాడేరు' కార్యక్రమం నిర్వహించారు. తొలుత పాడేరులోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా ఐటిడిఎ వరకూ వందలాది మంది భారీ ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ రోడ్డుపై రెండు గంటలపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మాన పడాల్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడారు. ఆదిమ తెగల (పివిటిజి) గిరిజనులకు గతంలో ఇచ్చిన వ్యక్తిగత రుణ పథకాలను రద్దు చేయడం దారుణమన్నారు. గిరిజనులకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన ఆదివాసీ సబ్‌ప్లాన్ బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాల పేరిట దారి మళ్లించి గిరిజనులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. సిసిడిపి, ట్రైకార్, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను, ఐకెపి నుంచి ఆదివాసీలకు వ్యక్తిగత, సామాజిక రుణాలను మంజూరు చేసి స్వయం ఉపాధికి దోహదం చేసే విధంగా గతంలో ఉన్న పథకాలను రద్దు చేయడంతో ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఆదివాసీలకు ప్రభుత్వోద్యోగాల్లో అవకాశం కల్పించే జిఒ నెంబర్ 3ని రద్దు చేయడం దారుణమన్నారు. ఈ జిఓను పునరుద్ధరించాలని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అడవులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ సంరక్షణ చట్టం అమలైతే మొట్టమొదట పివిటిజిలపైనే ప్రభావం పడనుందని, వారిని అడవి నుంచి గెంటివేస్తారని తెలిపారు. అటువంటి చట్టానికి పార్లమెంట్‌లో వైసిపి ఎంపిలు మిగతా 5లో



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న పివిటిజి గిరిజనులు

'సాగర్' ఆయకట్టులో సంక్షోభ ఛాయలు

- ఎగువ నుంచి జలాశయానికి రాని నీళ్లు
- గరిష్ట నిల్వకు సగం కూడా లేని వైనం
- వరి సాగుపై కొనసాగుతున్న సందిగ్ధత



పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలెం వద్ద ఖాళీగా ఉన్న పొలాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పైనుంచి నీళ్లు రాకపోవడంతో నాగార్జున సాగర్ ఆయకట్టులోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో కుడికాలువ కింద 11 లక్షల ఎకరాల్లో సాగు అనిశ్చితిలో పడింది. ఈ ఆయకట్టు కింద సుమారు రెండు లక్షల్లో వరి సాగు కావాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కలిపి కేవలం 2,200 ఎకరాల్లోనే వరి సాగులో ఉంది. అంటే కేవలం ఒక్క శాతం విస్తీర్ణంలోనే వరి నాట్లు పడ్డాయి. ప్రకాశం జిల్లాలో 38 వేల ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 1.22 లక్షల ఎకరాల్లో వేయాల్సి ఉంది. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కూడా కుడి కాలువ కింద కొంత ఆయకట్టు ఉంది. ఈ కాల్వలకు నీరు వచ్చే అవకాశాన్ని బట్టి 40 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. మొత్తంగా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఈ ఏడాది వరి సాగుపై అయోమయం నెలకొంది. సాగర్ జలాశయంలో ఆశించిన స్థాయిలో నీటి నిల్వ లేకపోవడంతో ఈ ఏడాది వరి సాగుకు నీరందించే విషయంలో ప్రభుత్వం ఇంతవరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాలలో కొంతమేరకు నీటి నిల్వలు మెరుగ్గా ఉన్నా కృష్ణా పరివాహక ప్రాంత కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో పెరగడం లేదు. దీంతో, దిగువకు నీటి విడుదల జరగడం లేదు. ఆల్మట్టి నుంచి వరద ప్రవాహం దిగువకు రాకపోవడంతో గత రెండు నెలలుగా సాగర్ జలాశయంలో నీటి నిల్వ పెరగలేదు. గతేడాది ఇదే సమయానికి కృష్ణా పరివాహక ప్రాంత అన్ని జలాశయాల్లోనూ నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది నిరాశాజనకంగా పరిస్థితి ఉంది. మరోవైపు సాగర్ ఆయకట్టు పరిధిలో దాదాపు 30 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, పత్తి పంట ఇతర పంటలపై రైతులు దృష్టి సారించడం లేదు. సాగర్ జలాశయంలో నీరులేకపోవడంతో పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఈ ఏడాది మిర్చి సాగు కూడా ఇంతవరకూ ఊపందుకోలేదు. మిర్చికి తప్పనిసరిగా రెండు మూడు నీటి తడులు అవసరం. నీరు విడుదల కాకపోతే మిర్చి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. ఆగస్టు మూడవ వారం వచ్చినా ఇంతవరకు 50 శాతం కూడా సాగు జరగలేదు. శ్రీశైలం జలాశయంలో గరిష్ట నీటి నిల్వ మిగతా 7లో



బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్, మోడీ

బీజింగ్ : దక్షిణాఫ్రికాలో జరగనున్న 15వ బ్రిక్స్ సదస్సుకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకానున్నారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా ఆహ్వానం మేరకు జోహెన్స్‌బర్గ్‌లో జరగనున్న 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి జిన్‌పింగ్ హాజరవుతారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు దక్షిణాఫ్రికాలో పర్యటిస్తారని ఆయన తెలిపారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బ్రిక్స్ సదస్సులో పాల్గొననున్నారు.

ఇద్దరు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనమండలికి గవర్నరు కోటాలో నియమితులైన ఇద్దరు ఎమ్మెల్సీలు కర్రి పద్మ, కుంభా రవిబాబు ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం వెలగపూడిలోని శాసనమండలి భవనంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఇద్దరు ఎమ్మెల్సీలతో ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యులుగా శాసనమండలిలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అనుసరించాల్సిన విధివిధానాలు, నిర్వర్తించాల్సిన కార్యకలాపాలు తదితర విషయాలను తెలిపే పుస్తకాలతో కూడిన కిట్లను వారికి ఛైర్మన్ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, పాలకొండ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి తదితరులు ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్సీలను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ సెక్రటరీ జనరల్ పిపికె రామాచార్యులు, శాసనమండలి ఒఎస్‌డి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన ఎమ్మెల్సీలు

గవర్నరు కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం పద్మ, రవిబాబు కుటుంబ సభ్యులతో కలిసి తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎమ్మెల్సీలను సిఎం అభినందించారు.

నెలాఖరులో అసెంబ్లీ ?

- సమన్వయం కోసం నోడల్ అధికారులు

లోపలి పేజీలో..

'కడప ఉక్కు' సాధనకు పోరాటమే మార్గం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

సంపాదకీయం


జనారణ్యంలోకి వన్యప్రాణులు

తిరుమలలో పులులు గాండ్రిస్తున్నాయి. కొండ చిలువలు బుసలు కొడుతున్నాయి. ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. ముక్కుపచ్చలారని ఒక చిన్నారి తిరుమల మెట్ల మార్గంలో ఇటీవల పులి నోట చిక్కి ప్రాణాలు కోల్పోయారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన బోనుల్లో చిరుత పులులు, ఎలుగుబంట్లు చిక్కుకుంటున్న ఘటనలు చూస్తునేవున్నాం. తిరుమల ఒకచోటే కాదు.. రాష్ట్రవ్యాప్తంగానూ విశాఖ, విజయనగరం మన్యం ప్రాంతాలు మొదలు కోస్తాంధ్రలోని కొండపల్లి ఏరియా, రాయలసీమలోని మడకశిర లాంటి ప్రాంతాల వరకు పలుచోట్ల వన్యప్రాణులు జనావాసాల్లో తారసపడుతూనేవున్నాయి. కోవిడ్ ఆంక్షల సమయంలో నిర్మానుష్యంగా మారిన రహదారుల మీదుగా సమీప అటవీ ప్రాంతాల్లోని వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్న వీడియోలు అప్పట్లో హల్‌చల్ చేశాయి. దాహర్తి తీర్చుకోవడానికి ఏకంగా ఒక చిరుత కాంక్రీక్టు కీకరాణ్యమైన హైదరాబాద్ మహానగరంలో ఎంతటి అలజడి సృష్టించిందో చూశాం. దేశవ్యాప్తంగానూ అనేక చోట్ల జనావాసాల్లోకి వన్యప్రాణులు వస్తున్న ఘటనలు తరుచూ చోటుచేసుకుంటూనేవున్నాయి. అభయారణ్యంలోనూ, కొండ, కోనల్లోనూ స్వేచ్ఛగా సంచరించాల్సిన వన్యప్రాణాలు ఇలా జనారాణ్యంలోకి చొరబడటం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామమే. కానీ ఇలా ఎందుకు జరుగుతోంది. చొరబడుతున్నది వన్యప్రాణాలు..మానవుడా? జీవావరణం మొత్తం ఇంతలా అతలాకుతలం కావడానికి కారణమెవ్వరు అంటే ముమ్మాటికీ మనుషులే.

ఎడారిలో చలికి వణుకుతున్న ఒంటెకు తలదాచుకోవడానికి అవకాశమిచ్చిన అరబ్బు చివరకు తానే నిర్వాసితుడు కావడం మనం నీతి కథల్లో చదివే ఉంటాం. ఆ నీతి కథ మనిషి లిఖితం కాబట్టి నీతి అలా ఏడ్చింది. అదే కథను వన్యప్రాణాలు తిరగరాస్తే కథనం మారుతుంది. నీతి మారుతుంది. అనాదిగా మనిషి స్వార్థానికి, ఆధిపత్యానికి బలైపోతున్నది మానవేతర జంతుజాలమే. ఒకప్పుడు భూ విస్తీర్ణంలో 70 శాతంతో కళకళలాడిన అడవులు నేడు 23 శాతానికే పరిమితమయ్యాయి. ఫలితంగా వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లింది. మనిషి జీవన అవసరాల కోసం అడవులను ధ్వంసం చేస్తూనే ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా 'పెట్టుబడి' దాహర్తికీ ఇటు మానవాళి కష్టాల సుడిగుండంలో చిక్కుకుపోవడమే గాకుండా అటు ప్రకృతి, జీవావరణం కూడా ధ్వంసమైపోతున్నాయి. కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం అడవుల్లోకి చొరబడిపోవడం, మైనింగ్ కోసం నిత్యం ధ్వంసరచన సాగుతోంది. బ్రెజిల్‌లో బోల్సనారో హయంలో బంగారు గనుల మాఫియా అమెజాన్ అడవుల్లో సృష్టించిన విధ్వంసం, కార్పొరేట్ రాజేసిన కార్చిచ్చుకు బలైపోయిన వృక్షసంపద, కోట్లాది వన్యప్రాణుల హననం ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతూనేవుంది. మనదేశంలో మణిపూర్ మొదలు ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇలా ప్రతి రాష్ట్రంలోనూ యురేనియం, బాక్సైట్ ఖనిజాల పేరిట, సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల మాటున అదానీ, జిందాల్ లాంటి కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం వన్యప్రాణులను, గిరిజనాలను, అటవీ సంపదను పాలకులు బలిపెడుతూనేవున్నారు. సుస్థిరాభివృద్ధి, ఎకో టూరిజం వంటి ముందు పేర్లతో సమస్త ప్రాణికోటిని కడగండ్ల పాల్జేస్తున్నారు.

అభయారణ్యాలు, కొండలు, గుట్టలు, కోనలు, సముద్ర గర్భాలు ..కార్పొరేట్ లాభాన్వేషణ వేటుకు జీవావరణం మొత్తం అతలాకుతలమవుతోంది. అందుకనే ఈ విపరీత పరిణామాలు. వన్యప్రాణాల ఆవాసాల్లోకి మనిషి చొరబడినందునే జీవారణ్యంలోకి అవి బలవంతంగా రావాల్సిన దైన్య పరిస్థితి నెలకొన్నది అందుకనే. రాష్ట్రంలోని పరిస్థితులు కూడా ఈ క్రమంలో చోటుచేసుకుంటున్నవే. ఎర్ర చందనం కోసం, రాళ్ల కోసం శేషాచలాన్ని, యురేనియం కోసం నల్లమల అడవులను, బాక్సైట్ కోసం మన్యం ప్రాంతాన్ని ధ్వంసం చేస్తున్న వైనాన్ని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. కానీ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టానికి తూట్లు పొడిచి కొత్త సవరణ చట్టాన్ని తీసుకొచ్చింది. గ్రామసభను కూడా పరిగణలోకి తీసుకోకుండా లక్షలాది అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు పంచేందుకు దుర్మార్గమైన సవరణలు ఆమోదింపజేసుకుంది. అంటే ఇక నుంచి అటవీ ప్రాంతాల్లో కార్పొరేట్ కంపెనీల చొరబాటు మరింతగా విస్తృతమవుతుంది. అటవీ ఆధారిత జీవకోటికి మరింత ముప్పు తప్పదన్నమాట. ఈ వినాశకర విధానాలకు పాలకులకు ఇప్పటికైనా స్వస్తి పలికి జీవావరణ పరిరక్షణకు నడుంబిగించాలి.

మహనీయుల మాట



ఒక దేశం యొక్క నిజమైన బలం అది దాచి ఉంచిన బంగారంలో కాక ఆ దేశ ప్రజల మేధో, భౌతిక బలంలో ఉంటుంది.

- సర్ సి.వి. రామన్

C.V. Raman

విషపు రాజకీయాల విన్యాసం !

వ్యాఖ్య

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం...గత కొన్నేళ్ళుగా ఆయన చేస్తూ వచ్చిన స్వాతంత్ర్య దినోత్సవాల ప్రసంగాల మాదిరిగానే మూస పద్ధతిలో సాగిపోయింది. 2014 నుండి భారతదేశం అన్ని రంగాల్లో ఎలా అద్భుతంగా పురోగతి సాధించిందో ప్రధాని మోడీ చెప్పుకున్న గొప్పలే ఆ ప్రసంగంలో వున్నాయి. ముస్లిం పాలనతో ప్రారంభమై బ్రిటీష్ పాలనతో ముగిసిన వెయ్యి సంవత్సరాల బానిస పాలనతో పోలుస్తూ అమృత కాలం కూడా వెయ్యి సంవత్సరాలు వుండాలని తాము ఎదురు చూస్తున్నామంటూ మోడీ పేర్కొన్నారు. అదొక్కటే ఈ ఏడాది ప్రసంగంలో కొత్త అంశంగా వుంది. ఇకపోతే సర్వసాధారణంగా ఎప్పుడూ వుండే మాదిరిగానే వివిధ రంగాల్లో ప్రభుత్వం సాధించిన విజయాల పట్టికతో ప్రసంగం నిండిపోయింది. ప్రధానిగా తాను పోషించిన కీలక పాత్ర మీదే మోడీ ప్రధానంగా దృష్టి సారించారు.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఆ ప్రగల్భాలతో కూడిన ప్రసంగాలను విమర్శనాత్మక దృష్టితో చూస్తూ, ప్రతి ఒక్క దాన్ని వాస్తవికతలతో సరిపోల్చడమనేది వృధా ప్రయాస అవుతుంది. గతంలోనూ ఇప్పుడు కూడా ఇటువంటి కీలకమైన, నిశిత పరిశీలనలు జరిగాయి. దీనికి బదులు, ప్రధాని ప్రసంగంలోని రాజకీయ కోణాలను పరిశీలించడం ఉపయుక్తంగా వుండగలదు.

మోడీ తన పంద్రాగస్టు ప్రసంగం ప్రారంభం నుండీ మణిపూర్ పరిస్థితులనే ప్రస్తావిస్తూ వచ్చారు. అయితే ఆయన చెప్పిన విషయాలు మణిపూర్ ప్రజలను, దేశంలోని ఇతర ప్రజలను నిరాశపరిచాయి. అక్కడ ఘర్షణలు ఎలా చెలరేగాయి, మరణాలు ఎలా సంభవించాయి, మహిళలను ఎలా అవమానించారు అన్న అంశాలపై ఆయన పైపైన మాట్లాడారు. కానీ, గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో శాంతి నెలకొందన్నారు. శాంతిని నెలకొల్పి, సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కృషి చేస్తున్నాయని ఆయన చెప్పారు. ఇక్కడ సందేశం స్పష్టంగా వుంది. జాతుల ఘర్షణ చెలరేగడానికి బాధ్యుడు, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను దీనికంతటికీ జవాబుదారీగా చేయలేదు. వాస్తవానికి అత్యంత ఘోరమైన లైంగిక నేరాల్లోని బాధితులకు న్యాయం చేయడం గురించి ఒక్క మాట కూడా లేదు. అలాగే ఈ సున్నితమైన ఈశాన్య ప్రాంత రాష్ట్రం ఏ రీతిన జాతుల ఘర్షణలు, అల్లర్ల ఊబిలోకి కూరుకుపోయిందో వివరించనూ లేదు.

మోడీ తన పంద్రాగస్టు ప్రసంగం ప్రారంభం నుండీ మణిపూర్ పరిస్థితులనే ప్రస్తావిస్తూ వచ్చారు. అయితే ఆయన చెప్పిన విషయాలు మణిపూర్ ప్రజలను, దేశంలోని ఇతర ప్రజలను నిరాశపరిచాయి. అక్కడ ఘర్షణలు ఎలా చెలరేగాయి, మరణాలు ఎలా సంభవించాయి, మహిళలను ఎలా అవమానించారు అన్న అంశాలపై ఆయన పైపైన మాట్లాడారు. జాతుల ఘర్షణ చెలరేగడానికి బాధ్యుడు, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను దీనికంతటికీ జవాబుదారీగా చేయలేదు. వాస్తవానికి అత్యంత ఘోరమైన లైంగిక నేరాల్లోని బాధితులకు న్యాయం చేయడం గురించి ఒక్క మాట కూడా లేదు. అలాగే ఈ సున్నితమైన ఈశాన్య ప్రాంత రాష్ట్రం ఏ రీతిన జాతుల ఘర్షణలు, అల్లర్ల ఊబిలోకి కూరుకుపోయిందో వివరించనూ లేదు.


ఇక రాబోయే 2024 ఎన్నికల వల్ల మోడీ ప్రసంగంలోని రాజకీయాలకు రంగులద్దబడ్డాయి. గత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల మాదిరిగా కాకుండా ప్రతిపక్షంపై పదునైన దాడి చేశారు. వారసత్వ రాజకీయాలు, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. తనకెంతో ఇష్టమైన అంశాన్ని ప్రస్తావిస్తూ, భారతీయ ప్రజాస్వామ్యంలో వారసత్వ పార్టీలన్నీ వ్యాధులు, వైకల్యాల వంటివని విమర్శించారు. అయితే, వారసత్వ రాజకీయాలపై ప్రధాని జరిపే తిరుగుబాటు ఒక వాస్తవాన్ని విస్మరించింది. బిజెపిలో మరింతమంది రాజకీయ వారసులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కీలక పదవులు చేపడుతున్నారన్నదే ఆ వాస్తవం. అవినీతిపై సుదీర్ఘంగా సాగిన ఆయన ప్రసంగం ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా దాడి చేసే మరో ఆయుధంగా మారింది. ప్రతిపక్ష నేతలపై అణచివేతకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఆయుధంగా వాడుతున్నారు. గత తొమ్మిదేళ్ళలో చోటు చేసుకున్న ఉన్నత స్థాయి అవినీతి రికార్డును, దాని పట్ల మోడీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును మనం చూసినట్లైతే, అవినీతి అనేది కేవలం ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వాడే ఆయుధమని స్పష్టంగా అర్ధమవుతోంది. రాఫెల్ ఒప్పందంలో కొట్టవచ్చినట్లు కనిపించే అవకతవకలను సమాధి చేయడం నుండి, హైవేల నిర్మాణంలోనూ, అలాగే పిఎంజెఎవై వంటి కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల అమలు వరకు విస్తృతంగా జరుగుతున్న అవినీతి గురించి కాగ్ తాజా నివేదిక బట్టబయలు చేసింది.

బుజ్జగింపు రాజకీయాలపై ఆయన దాడి చేశారు, ఇది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కొత్త అంశం, పైగా అరిష్ట సూచకం కూడా. ఇక్కడ బుజ్జగింపు అంటే మైనారిటీల బుజ్జగింపు. మోడీ అభిప్రాయం ప్రకారం, ఈ బుజ్జగింపు రాజకీయాలు జాతీయ స్వభావంపై చెరగని మచ్చ వేస్తున్నాయి, సామాజిక న్యాయానికి హాని కలిగిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితమే విస్తృతంగా ఘర్షణలు, మత హింస చెలరేగిన నుహ్‌కు కేవలం 70 కిలోమీటర్ల దూరంలో ఎర్రకోట బురుజులపై నుండి మాట్లాడుతున్న ప్రధాని మోడీ ఈ మైనారిటీ బుజ్జగింపు ధోరణిని ఖండిస్తున్నారు. నుహ్ ఘర్షణల్లో హిందూత్వ గూండాల దాడులకు మియో ముస్లింలు బలయ్యారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వారినే లక్ష్యంగా చేసుకుంది. మోడీకి సంబంధించినంత వరకు, ముస్లింల ఇళ్ళను, దుకాణాలను ప్రభుత్వం కూలగొడుతున్న సమయంలో ... మైనారిటీ బుజ్జగింపు ధోరణిని నిరసిస్తూ మాట్లాడటమంటే...లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మతోన్మాద ధోరణులను రెచ్చగొట్టడమన్నది వారి ఎజెండాలో వుందనడానికి స్పష్టమైన సంకేతంగా వుంది. మొత్తమ్మీద, నరేంద్ర మోడీ పదవ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి విషపు రాజకీయాల విన్యాసంగా వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నివాళి

ఆఖరి శ్వాస వరకూ మూఢనమ్మకాల నిర్మూలన కోసమే...



మన దేశంలో హేతువాద ఉద్యమానికి వేల సంవత్సరాల చరిత్ర వుంది. 2500 సంవత్సరాల క్రితమే చార్వాకులు దేవుని ఉనికిని ప్రశ్నించారు. మానవుడే దేవుణ్ణి సృష్టించాడని, యజ్ఞయాగాలు, కర్మకాండలు పురోహితుల బతుకుదెరువు కోసమేనని ఆ రోజుల్లోనే మూఢ నమ్మకాలను ఉతికి ఆరేశారు. ఆ తరువాత వేమన కూడా ముహూర్తాలను, తద్దినాలను అందులోని గుట్టును బట్టబయలు చేశాడు. ఆ తరవాత బ్రాహ్మణీయ భావజాల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ మహారాష్ట్రలో జ్యోతిరావు పూలే, కేరళలో నారాయణగురు, ఉమ్మడి మద్రాసులో పెరియార్ రామస్వామి, త్రిపురనేని రామస్వామి, గోరా, ఆ తరవాత కందుకూరి వీరేశలింగము, గురజాడ అప్పారావు లాంటి వారు మూఢనమ్మకాల నిర్మూలనకోసం ఎంతో కృషిచేశారు. వారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని మహారాష్ట్రలో ముప్పై సంవత్సరాలుకు పైగా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేశారు డాక్టరు నరేంద్ర దభోల్కర్. చివరికి పదేళ్ల కిందట పూనాలో ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో మతోన్మాదుల చేతిలో తుపాకీ గుళ్లకు బలయ్యారు. ఆ మరుసటిరోజే మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని ఆర్డినెన్స్‌గా తీసుకొచ్చారు. తరువాత చట్టమైంది. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా దభోల్కర్ చేసిన కృషి దీని వెనుక వుంది.

పది సంవత్సరాల పాటు డాక్టరుగా పని చేసి, ప్రజలను మోసగిస్తున్న దొంగబాబాలకు వ్యతిరేకంగా, నరబలులు, క్షుద్రపూజలు, చేతబడులు పేరుతో జరిగే మోసాలను బట్టబయలు చేస్తూ మహారాష్ట్రలో 1989లో 'మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలనా సమితి'ని ఏర్పాటు చేసి కొన్ని వేల సమావేశాలు ఏర్పాటుచేశారు. 2008లో ఎట్టకేలకు మూఢనమ్మకాల నిర్మూలన మోడల్ చట్టం ఏర్పటుచేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టించారు. ఆనాడు అసెంబ్లీలో మెజార్టీగా ఉన్న బిజెపి సభ్యులు ఈ చట్టాన్ని తిప్పి పంపారు. పట్టువీడని విక్రమార్కుడిలా 2011లో కూడా మరలా బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టించారు. బిజెపి సభ్యులు అడుగడుగునా అడ్డుపడ్డారు. దభోల్కర్‌ను గాంధీని చంపినట్లు చంపుతామని కూడా మతోన్మాదులు బెదిరించారు. కానీ భయపడలేదు. అయితే నిజంగానే మతోన్మాదులు 2013 ఆగస్టు 20న వాకింగ్ సమయంలో పొంచి ఉండి కాల్చి చంపారు. ఆ తరువాత అదే క్రమంలో మహారాష్ట్రలో ప్రముఖ సంఘసంస్కర్త పన్సారేను, కర్ణాటకలో గౌరీ లంకేశ్‌ను, కల్బుర్గిని మతోన్మాదులు కాల్చి చంపారు. వారి ఆశయాలను ముందుకి తీసుకుపోవటమే మన లక్ష్యంగా భావించి హేతువాద నాస్తికులు, అభ్యుదయవాదులు, సమాజ మార్పు కోసం పని చేయాలి.

/20న దభోల్కర్ పదవ వర్ధంతి/

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షుడు.

కవిత

మళ్ళీ.. మోసపోవొద్దు..

అబద్ధాలు చెప్పే వాడిని
అందలం ఎక్కిస్తే...
అభివృద్ధి ఏం చేస్తాడు...?
కోతలు కోసే వాడికి
అధికార పగ్గాలు అప్పగిస్తే ...
స్వీయ చేతలు వుంటాయా..?
గారడీ చేసిన వాడిని
ప్రజా గద్దెనెక్కిస్తే..
సుపరిపాలన అందిస్తాడా..?
గతంలో మన రాజ్యంలో
జరిగిందదే..!
అందరం తెలియక
మోసపోయాం..!
వాడు చెప్పిన అందమైన
అబద్ధాలను
నగ్న సత్యాలని నమ్మి అందలం
ఎక్కించాం..!
వాడు కోసిన పచ్చి కోతలకు
డూ డూ బసవన్నల్లా
తలలూపి
అప్పనంగా అధికారం
అప్పగించాం..!
వాడు చేసిన గారడీ మాటలకు
కేరింతలు కొట్టి గద్దెనెక్కించాం..!
అధికార పీఠం కోసం ....
వాడి ట్రూపు లోని జట్టంతా
ఆడిన కపట నాటకాలన్నీ
నేడు బట్టబయలౌతున్నాయి..!?
ప్రజల్లారా.. ..మేలుకోండి..!
దండులా వస్తోన్న నాయకులలో
చేతలు గల నేతలు ఎవరో
గుర్తించండి..!
అభివృద్ధి కాముకులను
ఎన్నుకోండి..!
నయవంచకుల మాటలను నమ్మి
మళ్ళీ మోసపోయారా....
దశాబ్దాల దేశ ప్రగతి
మరోసారి వెనక్కి పోతుంది
సుమా...!?

- జి.సూర్యనారాయణ,
దివిసీమ.

మీ రచనలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com


విశ్లేషణ

ఉపాధి నైపుణ్యం నిల్ - ఓట్లు తెచ్చే విద్వేషం ఫుల్

సత్య

ఈ మధ్య రెండు అంశాలపై వార్తలు వచ్చాయి. ఒకటి దేశంలో నిపుణులైన కార్మికుల లేమి గురించి ఒక నివేదిక వెలువడింది. నైపుణ్య శిక్షణ పేరుతో చేసిన హడావుడి ఎలా విఫలమైందో అంతకు ముందే విశ్లేషణలు వచ్చాయి. విద్వేష ప్రసంగాల మీద నమోదైన కేసుల గురించి ఒక కమిటీని ఆగస్టు 18 లోగా ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. విద్వేష ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన యంత్రాంగం కొన్ని చోట్ల పని చేయటం లేదని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు విన్నవించింది. రెండింటిలోనూ కేంద్ర వైఫల్యం స్పష్టమైంది. నిజానికి సుప్రీం కోర్టు ఆదేశం మోడీ సర్కార్‌ను పరోక్షంగా అభిశంసించటం తప్ప వేరు కాదు. నైపుణ్య మెరుగుదల కోసం ఎన్నో పథకాలు, ఏకంగా మంత్రినే ఏర్పాటు చేసిన ఘనత తమదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. ఇతర పథకాలు, ప్రకటనల మాదిరే ఇది కూడా ఎలాంటి ఫలితాలను ఇవ్వలేదు. 2023 ఆగస్టు రెండవ వారంలో స్కిల్ ఫైనాన్సింగ్ రిపోర్టు 2023 కొన్ని అంశాలను వెల్లడించింది. దేశంలోని 78 శాతం మంది యువతరానికి అభ్యాససిద్ధమైన నైపుణ్యాలు లేవు. జనాభాలో 15-24 సంవత్సరాల యువత 25.4 కోట్ల మంది ఉన్నారు. ఉపాధికి అవసరమైన ఉన్నత నైపుణ్యాలు కలిగిన వారు కేవలం 46.2 శాతం మందే ఉన్నారు. మొత్తం మీద నైపుణ్యాల ర్యాంకులో మన దేశం ప్రపంచంలో 60వ స్థానంలో ఉంది. 2015 వరకు మన దేశంలోని కార్మికుల్లో 4.7 శాతమే నైపుణ్య శిక్షణ పొందగా దక్షిణ కొరియాలో 90, జపాన్‌లో 80, బ్రిటన్‌లో 68, అమెరికాలో 52 శాతం ఉన్నారు. మన దేశంలో శిక్షణ పెద్ద ఎత్తున అవసరం గనుక నిధుల కేటాయింపు పెద్ద ఎత్తున పెంచాల్సి ఉంటుందని కూడా సదరు నివేదిక సలహా ఇచ్చింది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన తొలి పార్లమెంటు ప్రసంగంలో ఏడు సార్లు యువత అనే పదాన్ని ఉచ్ఛరించారు తప్ప ఒక్కసారి కూడా నైపుణ్యం గురించి చెప్పలేదు (అది మోడీ సర్కార్ రాసి ఇచ్చిన ప్రసంగమే). 2023 బడ్జెట్‌లో ప్రకటించిన నైపుణ్య శిక్షణ పథకాలు వాస్తవ రూపం ధరించాలంటే సంవత్సరాలు పడుతుంది. లోక్‌సభలో 2022 మార్చి 14న ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ప్రకారం పిఎంకెవివై 1.0 కింద 18.04 లక్షల మంది నమోదై శిక్షణ పొందగా వారిలో 13.32 లక్షల మందికి నైపుణ్య సర్టిఫికెట్లు ఇచ్చారు. వారిలో కేవలం 2.53 లక్షల మందికే లేదా 19 శాతం మందికి మాత్రమే ఉపాధి దొరికింది. పిఎంకెవివై 3.0 ప్రకారం స్థానిక అవసరాలకు అనుగుణ్యంగా నైపుణ్యం ఇవ్వాలని నిర్ణయించారు, తమిళనాడు వంటి పారిశ్రామిక రాష్ట్రంలో కూడా మొత్తంగా అది విఫలమైంది. పిఎంకెవివై 3.0లో 4.98 లక్షల మంది నమోదు చేసుకోగా 4.45 లక్షల మందికి శిక్షణ ఇచ్చారు. వారిలో 1.72 లక్షల మంది సర్టిఫికెట్లను పొందారు. వారిలో కేవలం 15,450 మందికి మాత్రమే ఉపాధి దొరికింది. పిఎంకెవివై 1.0లో 12,218 నైపుణ్య శిక్షణ కేంద్రాలుండగా, 2.0 నాటికి 9,030 కేంద్రాలు, 3.0లో కేవలం 683 మాత్రమే ఉన్నాయి. ఇదీ ఆ విశ్లేషణ సారం.



యువ భారతం అని, తగినంత మంది పని చేసే వారున్నారని గొప్పలు చెప్పుకుంటే చాలదు. ఏటా కోటి మంది కొత్తగా పని కోసం వస్తున్నారు. ఏటికేడు కొత్త సాంకేతికతలు ముందుకు వస్తున్నాయి. దానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తే తప్ప ప్రయోజనం ఉండదు. ప్రయివేటు రంగం ఆ బాధ్యత తీసుకొనేందుకు ముందుకు వచ్చిన దాఖలాలు లేవు. గతేడాది జూన్‌లో భారత్ కోసం కృత్రిమ మేధ అనే ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. పాతిక లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఏ దేశానికైనా నిపుణులైన కార్మికులు అవసరం. అది వారి జీవన పరిస్థితులను మెరుగుపరుస్తుంది. అమెరికా మీడియా యుఎస్ న్యూస్ 2022 సెప్టెంబరులో 85 దేశాల పరిస్థితుల మీద సర్వే చేసి జాబితాను ప్రకటించింది. కార్మిక నైపుణ్యంలో జపాన్, దక్షిణ కొరియా తరువాత చైనా మూడవ స్థానంలో ఉంది. మన దేశం ఇరవై ఒకటవ స్థానంలో ఉంది. మొత్తం మీద అన్ని రకాల నైపుణ్యాల్లో చైనా 17వ దేశం కాగా మనం 31వ స్థానంలో ఉన్నాం. ఏ దేశమైనా నైపుణ్యం పెంచటమే కాదు, పరిశోధన-అభివృద్ధికి భారీ మొత్తాలను ఖర్చు చేయాల్సి ఉంది. మన దేశంలో ఆ రెండూ లేవు.

మరి మనం ఎక్కడున్నాం, ఏం చేస్తున్నాం అన్నది ప్రశ్న. చేసేందుకు ఉపాధి లేక, ఉపాధికి అవసరమైన నైపుణ్యం లేక నామమాత్రపు వేతనాలతో పని చేసే యువతను తప్పు దారి పట్టించటానికి అనువైన పరిస్థితులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. దానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం వైపు చూడకుండా ఆవు పేడ, మూత్రంలో ఉన్న బంగారాన్ని వెలికి తీస్తే ధనిక దేశంగా మారతాం అనే ఆలోచనలో ఇంకా ఉన్నామంటే అతిశయోక్తి కాదు.

స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారిగా... దేశంలో ఉన్న విద్వేష పూరిత వాతావరణం, ఉదంతాల గురించి సర్వోన్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు ఇటీవలి కాలంలో పదే పదే ఆందోళన వెల్లడిస్తున్నది. జాతి, మతం, పుట్టిన ప్రాంతం, నివాసం, భాష తదితర అంశాల ప్రాతిపదికన భిన్న పౌర సమూహాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టి సామరస్యతను దెబ్బతీసే శక్తులను అదుపు చేసేందుకు ఐపిసిలో కొన్ని సెక్షన్లు ఉన్నాయి. వాటిలో ఒకటైన 153 ఏ ప్రకారం నమోదు చేసిన కేసులు దేశంలో 2014-2020 కాలంలో 323 నుంచి 1,804కు పెరిగాయి. జాతీయ సమగ్రతను దెబ్బ తీసేందుకు పాల్పడేవారి మీద 153 బి సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తారు. ఇవి 13 నుంచి 82కు పెరిగాయి. తప్పుదారి పట్టించే, విద్వేషాన్ని, శతత్వాన్ని పెంచే సమాచారాన్ని వ్యాపింప చేయటం, ప్రకటనలు చేసే వారిని శిక్షించేందుకు ఉన్న సెక్షన్ 505 కేసులు 2017లో 257 ఉంటే 2020 నాటికి 1,527కు పెరిగాయి. రాష్ట్రాల్లో బిజెపి అధికారం ఉన్న చోట ఒక సామాజిక తరగతి మీద అసలు కేసులే నమోదు చేయటం లేదన్న విమర్శలున్న సంగతి తెలిసిందే. అందుకే బాధితులు లేదా ఎవరూ ఫిర్యాదు చేయకున్నా పోలీసులు తమంతట తాముగా కేసులు నమోదు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. దేశంలో తలెత్తుతున్న ఆందోళనకర పరిస్థితికి ఈ కేసులు, సుప్రీం కోర్టు ఆదేశాలు నిదర్శనం.

2022 అక్టోబరు 21న సుప్రీం కోర్టు చరిత్రలో ఒక కొత్త అధ్యాయం తోడైంది. న్యాయమూర్తులు కెఎం జోసెఫ్, హృషికేశ్ రాయ్ బెంచ్ "ఇది 21వ శతాబ్దం, మనం దేవుడిని ఎంతకు దిగజార్చాము? మనకు శాస్త్రీయ దృష్టి ఉండాలని ఆర్టికల్ 51వ చెబుతున్నది. మతం పేరుతో జరుగుతున్నదేమిటి? ఇది విషాదం" అని చెప్పింది. మతం తటస్థంగా ఉండే దేశంలో విద్వేష వాతావరణం ఉందంటూ సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. తాము చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు ఇస్లాంకు వ్యతిరేకంగా చేసిన ద్వేషపూరిత ప్రసంగాలకు మాత్రమే పరిమితం కాదని, ఏ మతానికి వ్యతిరేకంగా ఎవరు చేసిన వాటికైనా వర్తిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్ పోలీసు అధికారులు అలాంటి ద్వేష పూరిత ప్రసంగాలు ఏ మతం వారు చేసినప్పటికీ వాటి గురించి ఎవరూ ఫిర్యాదు చేసినా, చేయకున్నా స్వంతంగా కేసులు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. తమ ఆదేశాలు పాటించకుంటే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఆర్టికల్ 51(ఏ) ప్రకారం ప్రతి ఒక్కరూ మౌలిక విధుల్లో భాగంగా శాస్త్రీయ దృష్టి, మానవత్వం, పరిశీలన, సంస్కరణ దృక్పథాన్ని పాటించాలని, భారత్ ఒక లౌకిక దేశంగా రాజ్యాంగం ఆలోచించిందని, భిన్న మతాలు, కులాలకు చెందిన వారు సామరస్య పూర్వకంగా జీవించనట్లైతే సహోదరభావం ఉండదని కోర్టు పేర్కొన్నది.

అత్యాచారాల కేసుల్లో శిక్షలు పడిన వారికి ఎలాంటి మినహాయింపులు ఇవ్వకూడదని చట్టం చేసింది కేంద్ర ప్రభుత్వం. తాను చేసిన చట్టాన్ని తానే ఉల్లంఘించింది. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం చేసి కుటుంబ సభ్యులను హత్య చేసిన కేసులో శిక్షలు అనుభవిస్తున్న పదకొండు మంది పెరోల్‌పై వెలుపలికి వచ్చినపుడు సత్ప్రవర్తనతో మెలిగారని చెబుతూ జీవిత కాల శిక్ష పడిన వారిని గుజరాత్ సర్కార్ విడుదల చేసింది. 2002లో గోద్రా రైలు సజీవదహనం, దానిలో కొందరు కరసేవకులు మరణించిన తరువాత జరిగిన మారణకాండలో ఈ దారుణం చోటు చేసుకుంది. బిజెపి పెద్దలు వారికి ఘనస్వాగతాలు పలికి స్వీట్లు పంచారు, వీరకుంకుమలు దిద్దారు. తమ 'ఘన'కార్యానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం ఉందని ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు నివేదించింది. బాధితులుగా ఉన్న తమను దీని గురించి సంప్రదించలేదని, విడుదల గురించి తమకు తెలుపలేదని బిల్కిస్ కుటుంబం పేర్కొన్నది. చిత్రం ఏమిటంటే ఈ నేరగాళ్లను గుజరాత్ ప్రభుత్వం ఆజాదీ కా అమృత మహోత్సవం పేరుతో ఆగస్టు 15న విడుదల చేసింది. నారీశక్తి, మహిళలకు రక్షణ గురించి కబుర్లు చెబుతున్న పెద్దలు ఈ కేసులో రేపిస్టులను విడుదల చేసేందుకు ఎవరినీ ఖాతరు చేయలేదు. కేసు విచారణ జరిపిన సిబిఐ కోర్టు జడ్జి కూడా వీరి విడుదలను వ్యతిరేకించారు." ఈ కేసులో నేరగాళ్లకు, బాధితులకు ఎలాంటి సంబంధమూ లేదు, ఎలాంటి వైరమూ లేదు. బాధితులు ఒక మతానికి చెందిన వారనే కారణాలతో మాత్రమే నేరానికి పాల్పడ్డారు. ఈ కేసులో చిన్న పిల్లలను, గర్భిణీని వదల్లేదు. ఇది అత్యంత హీనమైన విద్వేషపూరిత, మానవత్వం మీదనే జరిపిన నేరం" అని పేర్కొన్నారు. ఇలాంటి రెండింజన్ల పాలనే మణిపూర్‌లో కూడా ఉన్నందున మహిళలను నగంగా తిప్పి, అత్యాచారం చేసిన ఉదంతాన్ని వెల్లడి కాకుండా తొక్కి పెట్టాలని చూశారు. వీడియో వెల్లడి కావటంతో మొక్కుబడి ప్రకటనతో సరిపుచ్చారు. విద్వేషాన్ని రెచ్చగొట్టటంలో ఎవరూ తక్కువ తినటం లేదు. రిజర్వేషన్ల గురించి ఆందోళన తలెత్తితే మణిపూర్‌లో చర్చిలను తగులబెడతారు, మహిళల మీద అత్యాచారాలు చేస్తారు. మత విద్వేషం చెలరేగితే హర్యానాలో ఒక మతానికి చెందిన వారి నివాసాలు, దుకాణాల మీదకు మాత్రమే అక్కడి ప్రభుత్వ అధికారులు బుల్డోజర్లు నడుపుతారు. దేశం ఎటుపోతోంది అని గాదు ఎటు తీసుకుపోతున్నారు, ఎవరు అన్నది ఆలోచించాల్సిన తరుణం వచ్చింది. దేశంలో ముస్లింలు, దళితుల మీద జరుగుతున్న దాడులను నమోదు చేసేందుకు 2017లో హిందూస్థాన్ టైమ్స్ పత్రిక పూనుకుంది. దాన్ని వెంటనే యాజమాన్యం నిలిపివేసింది, దానికి చొరవ చూపిన సంపాదకుడు రాజీనామా చేసి తప్పుకున్నారు. దీని వెనుక ఎవరి ఒత్తిడి ఉండి వుంటుందో వేరే చెప్పాలా ? ★

ఎపిపిఎస్‌సిలో నారాయణ ఐఎఎస్ అకాడమి సత్తా

ప్రజాశక్తి - విజయవాడ

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో నారాయణ ఐఎఎస్ అకాడమి సత్తాచాటింది. ఈ మేరకు నారాయణ గ్రూప్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 పలితాల్లో 13 మంది డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికైతే అందులో ముగ్గురు నారాయణ విద్యార్థులే కావడం గర్వకారణమని తెలిపారు. ఎం భానుప్రకాశ్‌రెడ్డి, కె సాయి ప్రత్యూష, పి సువర్ణరెడ్డి డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికయ్యారని వివరించారు. పట్టుదల, నిరంతర కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటూ నారాయణ విద్యార్థులు నిరూపించారని పేర్కొన్నారు. గత 11 సంవత్సరాలుగా వేలాది మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత తమ సంస్థకు ఉందన్నారు.

చెప్పకుండ వెళ్లినందుకే లుక్‌ఔట్ నోటీసులు

- హైకోర్టులో ఎపి సిఐడి అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రయివేట్ లిమిటెడ్ నగదు మళ్లింపు కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఆ సంస్థ ఎండి సిహెచ్ శైలజ దర్యాప్తు అధికారులకు ఏ సమాచారం ఇవ్వకుండానే విదేశాలు వెళ్లిన కారణంగా ఆమె కోసం తాము లుక్‌ఔట్ నోటీస్ జారీ చేశామని ఎపి సిఐడి హైకోర్టుకు చెప్పారు. మార్చి 21న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో కఠిన చర్యలు తీసుకోవద్దని చెప్పిందని, అయితే శైలజ చెప్పకుండా విదేశాలకు వెళ్లిన కారణంగా ఇచ్చిన లుక్‌ఔట్ నోటీసు కోర్టుధిక్కరణ కిందకు రాదని సిఐడి పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ లుక్‌ఔట్ నోటీసు ఇచ్చారంటూ మార్గదర్శి ఎండి శైలజ వేసిన పిటిషన్లను జస్టిస్ సురేందర్ విచారించారు. విచారణకు ఎపి సిఐడి ఎఎస్‌పిలు రాజశేఖర్‌రావు, రవికుమార్ హాజరయ్యారు. అదనపు డిజిపి ఎన్.సంజయ్, ఎపి హోం శాఖ ముఖ్యకార్యదర్శి హరీశ్ హాజరుకాలేదు. విచారణ సెప్టెంబర్ 15కు వాయిదా వేశారు.

ఆ పిటిషన్‌కు నంబర్ కేటాయించండి

రిజిస్ట్రీకి జస్టిస్ లక్ష్మణ్ ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ తప్పుడు చార్జిషీట్ దాఖలు చేసిందంటూ ఎపి ప్రభుత్వ సలహాదారు అజేయకల్లం దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీకి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం ఆదేశించారు. నెంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చారు. 2023, ఏప్రిల్ 29న సిఆర్‌పిసి 161 కింద అజేయ కల్లం వాంగ్మూలాన్ని సిబిఐ విచారణాధికారి వికాస్‌కుమార్ రికార్డు చేశారు. అయితే చార్జిషీట్‌లో ముఖేశ్ శర్మ పేరుతో ఉంది. తాను చెప్పని విషయాలను చెప్పినట్టుగా నమోదు చేశారని కల్లాం వాదన. దీనిపై దాఖలు చేసిన పిటిషన్‌కు రిజిస్ట్రీ నంబర్ కేటాయించకపోవడంపై జరిగిన వాదనల తర్వాత న్యాయమూర్తి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషన్‌ను విచారిస్తామని చెప్పారు.

మాకు బెయిలు ఇవ్వండి

వైఎస్ వివేకా హత్య కేసులో నిందితులుగా 5 నెలలు జైలులో ఉన్నామని, తమకు బెయిల్ ఇవ్వాలని వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డిలు హైకోర్టును కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం బెయిల్ పిటిషన్లను సత్వరమే పరిష్కరించాలని, తమ పిటిషన్లపై విచారణ పూర్తి చేసి బెయిల్ ఇవ్వాలని కోరారు. వారి పిటిషన్లను జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. విచారణ వచ్చే గురువారానికి వాయిదా పడింది.

అడ్డగోలు అదనపు ఛార్జీలు వద్దు

- రుణాలు చెల్లించలేని వారికి ఊరట
- బ్యాంక్‌లకు ఆర్‌బిఐ కొత్త మార్గదర్శకాలు



న్యూఢిల్లీ : పలు కారణాలతో రుణాలు చెల్లించలేక, దివాలా తీసిన వారిపై బ్యాంక్‌లు భారీగా విధించే అదనపు ఛార్జీలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి)లు అడ్డగోలుగా ఛార్జీలు వసూలు చేయకుండా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. విత్త సంస్థలు, రుణదాతలు, రెగ్యులేటేడ్ సంస్థలు (ఆర్ఇ) జరిమానా రూపంలో వసూలు చేసే వడ్డీ విషయంలో సహేతుకంగా, పారదర్శకంగా ఉండాలని సూచించింది. రుణగ్రహీతలు చెల్లించలేని సమయంలో చాలా సంస్థలు నిబంధనలు ఆసరాగా చేసుకొని జరిమానా వడ్డీ రేట్లను సాధారణంగా కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆర్‌బిఐ తెలిపింది. జరిమానా రూపంలో ఆదాయం పెంచుకొనే సాధనాలను వాడకూడదని పేర్కొంది. రుణ చెల్లింపులు చేయలేకపోతే జరిమానాను ఛార్జీల రూపంలో మాత్రమే విధించాలని ఆదేశించింది. దీనిని ఆదాయ మార్గంగా మార్చుకోకూడదని సూచించింది. వడ్డీకి మరే ఇతర అదనపు భారాలను జోడించకూడదని స్పష్టం చేసింది. జరిమానా వడ్డీ, ఇతర ఛార్జీల విధానాలను తయారు చేసేందుకు ఓ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌బిఐ తెలిపింది.

ఫిక్స్‌డ్ వడ్డీ రేట్లకు మారొచ్చు..

రుణ గ్రహీతలు ఫిక్స్‌డ్ వడ్డీ రేట్లకు మారేలా బ్యాంక్‌లు, విత్త సంస్థలు అవకాశం కల్పించాలని ఆర్‌బిఐ ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా ఇఎంఐ, కాల వ్యవధి రెండూ పెంచుకునే అవకాశం సైతం కల్పించాలని సూచించింది. దీనిపై ఆర్‌బిఐ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే.. రుణ కాలవ్యవధిలో ఎన్నిసార్లు వడ్డీ రేట్లకు మారేందుకు అవకాశం ఉంటుందో కూడా రుణగ్రహీతలకు ముందే స్పష్టం చేయాలని తెలిపింది.

అమెరికా బ్యాంక్‌లకు మరో దెబ్బ

- రేటింగ్‌ను తగ్గించనున్న ఫిచ్..!



బీజింగ్ : అమెరికన్ బ్యాంక్‌ల పరపతికి కోత పెట్టిన మూడీస్ బాటలోనే ఫిచ్ రేటింగ్స్ నిర్ణయం తీసుకోనుందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. త్వరలోనే మోర్గాన్ సాచేతో సహా డజన్ల కొద్ది బ్యాంక్‌ల పరపతిని తగ్గించనున్నట్లు ఫిచ్ హెచ్చరించింది. అగ్రరాజ్యం బ్యాంకింగ్ వ్యవస్థపై ఆందోళనలు పెరుగుతున్నప్పటికీ, ఆ దేశ ఆర్థిక వ్యవస్థపైనా అనేక ఒత్తిడీలు నెలకొని ఉన్నాయని విశ్లేషించింది. మూడీస్ ఇటీవల 10 చిన్న, మధ్య తరహా అమెరికన్ బ్యాంకుల క్రెడిట్ రేటింగ్‌లను తగ్గించి, కొన్ని పెద్ద యుఎస్ బ్యాంకుల క్రెడిట్ రేటింగ్‌ల కోతపై హెచ్చరించిన విషయం తెలిసిందే. గతేడాది అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ భారీగా వడ్డీ రేట్లను పెంచడంతో బ్యాంకింగ్ వ్యవస్థలో గందరగోళం నెలకొందని ఫిచ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికాలో ఈ ఏడాది ప్రారంభంలోనూ మూడు, నాలుగు బ్యాంక్‌లు దివాలా అంచునకు చేరిన విషయం తెలిసిందే. ఆగస్ట్ తొలి వారంలో గ్లోబల్ రేటింగ్ ఎజెన్సీ మూడీస్ అమెరికకు చెందిన 10 బ్యాంక్‌ల పరపతికి కోత పెట్టింది. మరిన్ని బ్యాంక్‌ల రేటింగ్‌ను తగ్గిస్తామని హెచ్చరించింది. దేశంలోని కొన్ని అతిపెద్ద రుణదాతల స్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపింది. స్థూలంగా 27 బ్యాంక్‌లపై అంచనాలను విడుదల చేసింది.

ఆరోగ్య హక్కు చట్టం కోరుతూ.. 20న రౌండ్ టేబుల్ సమావేశం

- ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజస్థాన్ రాష్ట్రం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకురావాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 20న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొంది. శుక్రవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రజారోగ్య వేదిక గౌరవాధ్యక్షులు కెవిఎస్ సాయిప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు, నాయకులు జి విజయప్రకాష్ మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రస్తుతం ఆరోగ్య సమస్య చాల తీవ్రంగా వుందన్నారు. రాష్ట్రంలో వైద్యం ప్రజలు భరించలేనంతగా ఖరీదైన అంశంగా మారిందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్, ఆరోగ్యశ్రీ సేవలు, ఇన్సూరెన్స్ స్కీమ్‌లు, ఆయుష్మాన్ భారత్ యోజన స్కీములు లాంటివి ఎన్ని వున్నా వైద్యం కోసం ప్రజలు ప్రైవేటుగా పెట్టే సగటు ఖర్చు ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా వుందని తెలిపారు. వైద్యం కోసం ఆస్తులు అమ్మడమే కాదు, అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని అన్నారు. వైద్య ఖర్చులను మధ్యతరగతి ప్రజలు కూడా భరించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వైద్యం ఖర్చులు భరించలేక పేదరికంలోకి పోయే కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోందన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖలో ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన రిటైర్డు ఐఎఎస్ పివి రమేష్ హాజరుకానున్నారని తెలిపారు. వైద్యరంగంలో విశేష అనుభవం వున్న వైద్యులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు ఈ సమావేశానికి హాజరై తమ అమూల్య మైన సలహాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఆరోగ్య హక్కు చట్టం కోసం ప్రతిఒక్కరూ నినదించాలన్నారు.

75 మంది రాజ్యసభ సభ్యులపై క్రిమినల్ కేసులు !

న్యూఢిల్లీ : రాజ్యసభలోని మొత్తం 225 మంది సిట్టింగ్ ఎంపీలలో, 75 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫామ్స్ (ఎడిఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (న్యూ) లు శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నాయి. మహిళలకు వ్యతిరేకంగా నేరాలపై నలుగురు ఎంపీలు విచారణను ఎదుర్కొంటున్నారని, వీరిలో అత్యధికంగా బిజెపి ఎంపిలు ఉన్నారని ఆ నివేదిక తెలిపింది. 233 మంది రాజ్యసభ సభ్యులలో 225 మంది నేర వివరాలను విశ్లేషించి, అప్‌డేట్ చేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం రాజ్యసభలో ఒక స్థానం ఖాళీగా ఉండగా, మరో ముగ్గురు ఎంపిల వివరాలు అందుబాటులో లేవని తెలిపింది. నాలుగు జమ్ముకాశ్మీర్ స్థానాలపై అనిశ్చితి నెలకొందని వివరించింది. మొత్తం 225 మంది రాజ్యసభ ఎంపిల్లో 75 మంది వివరాలను విశ్లేషించగా.. 33 శాతం మంది ఎంపిలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపింది. రాజ్యసభ సిట్టింగ్ ఎంపిల్లో 18 శాతం మంది (41 మంది) తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఇద్దరు ఎంపిలపై హత్య కేసులు (ఐపిసి 302) కూడా ఉన్నాయని పేర్కొంది. నలుగురు ఎంపిలు మహిళలకు సంబంధించిన క్రిమినల్ కేసుల్లో విచారణను ఎదుర్కొంటున్నారు. వీరిలో అత్యధికంగా 23 మంది బిజెపి ఎంపిలు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మహారాష్ట్రకు చెందిన 19 మంది ఎంపిల్లో 12 మంది (63శాతం), బీహార్ నుండి 16 మందిలో పది మంది (63శాతం), యుపి నుండి 30 మందిలో ఏడుగురు (23 శాతం), తమిళనాడుకు చెందిన 18 మందిలో (33 శాతం), కేరళకు చెందిన తొమ్మిది మందిలో ఆరుగురు (67 శాతం), పశ్చిమబెంగాల్‌కు చెందిన 16 మందిలో ఐదుగురు (31శాతం) తమ అఫిడవిట్‌లలో తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు.

పిఎం ఇ-బస్ ఆర్‌టిసిలకూ అనుమతించాలి

- సబ్సిడీ, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఇవ్వాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవలి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన పిఎం ఎలక్ట్రిక్ బస్ సేవా పథకాన్ని ఆర్‌టిసిలకు అనుమతించాలని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ మున్సిపల్ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి అఖిల భారత రోడ్డు రవాణా కార్మిక సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య లేఖ రాశారు. పిఎం ఇ బస్ సేవా పథకం కింద పట్టణ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర రవాణా సంస్థ (ఎస్‌టియు)లు సేకరించేందుకు, ఆపరేట్ చేసేందుకు, నిర్వహించేందుకు అనుమతించాలని, సబ్సిడీని కూడా ఇవ్వాలని, రాష్ట్ర రవాణా సంస్థలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందించాలని ఆ లేఖలో కోరారు.

"రూ.57,613 కోట్ల వ్యయంతో చేపట్టే పిఎం ఎలక్ట్రిక్ బస్సు పథకం కింద 169 నగరాల్లో 10,000 ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని తెలిసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లు అందిస్తున్నాయి. ఈ ఎలక్ట్రిక్ బస్సు పథకాన్ని పిపిపి మోడల్‌లో నిర్వహించనున్నారు. జిసిసి మోడల్ కింద నడుపుతున్న ఎలక్ట్రిక్ బస్సులతో ఆర్‌టిసి ఆదాయానికి గండి పడుతోంది. దీనివల్ల వచ్చిన ఆదాయం కంటే, కాంట్రాక్టర్లకు కడుతున్న మొత్తమే ఎక్కువగా వుంటోంది. ఆ మొత్తాన్ని కూడా ఆర్‌టిసిలే కడుతున్నాయి" అని ఆ లేఖలో పేర్కొన్నారు.

"ఆర్‌టిసి చట్టం 1950 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌టియులను ఏర్పాటు చేశాయి. పట్టణ, గ్రామీణ, కొండ, మారుమూల గ్రామాల ప్రజలకు సరసమైన టిక్కెట్ ఛార్జీలతో ఆర్‌టిసి బస్సు సేవలను అందిస్తోంది. రిజర్వేషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా ఎక్కువ మంది నిరుద్యోగ యువతకు ఉపాధిని అందిస్తోంది." అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఆ పథకాలు పునరుద్ధరించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ఇవ్వడం ఆదివాసీ వ్యతిరేక విధానానికి నిదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతగిరి జడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్, నాయకులు పి.లక్కు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్, మాతృభాష విద్యావలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు. చింతపల్లి మాజీ ఎంపిపి బాబూరావు, కాంగ్రెస్ నాయకులు సుబ్బారావు, జనసేన పార్టీ నాయకులు రాజన్ మద్దతు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పిఒ హామీ

వందలాదిగా పివిటిజి గిరిజనులు ఐటిడిఎ గేటు వద్ద బైఠాయించడంతో పిఒ అభిషేక్ అక్కడకు చేరుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. అర్హులందరికీ అంత్యోదయ కార్డులు ఇస్తామని, అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని, సిసిడిపి నిధులు మంజూరైతే గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఈశాన్య ఢిల్లీ అల్లర్ల కేసులో ముగ్గురి విడుదల

- ఢిల్లీ కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : ఈశాన్య ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో ముగ్గురు వ్యక్తులను ఢిల్లీ కోర్టు విడుదల చేసింది. సాక్ష్యాధారాలను ఢిల్లీ పోలీసుల దర్యాప్తు అధికారి తారుమారు చేశారన్న అనుమానాలను కోర్టు వ్యక్తం చేసింది. ముందుగా నిర్ణయించిన విధంగా, యాంత్రికమైన పద్ధతిలో వారిపై చార్జిషీట్లు దాఖలు చేశారని పేర్కొంది. దర్యాప్తును మరోసారి సమీక్షించాలంటూ న్యాయమూర్తి ఈ విషయాన్ని ఢిల్లీ పోలీసులకే తిరిగి నివేదించారు.

కేరళలో పేద విద్యార్థులకు ఉచిత బస్ ప్రయాణం, క్యాంటీన్ సౌకర్యం

తిరువనంతపురం : రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు మరింత భద్రంగా తమ చదువును కొనసాగించడానికి కేరళలోని పినరయి విజయన్ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. కళాశాల వరకూ ఉచితంగా బస్సు ప్రయాణంతో పాటు, కళాశాల క్యాంటీన్‌లో ఎలాంటి ఛార్జీలు లేకుండా ఆహార సౌకర్యాన్ని కల్పించింది. కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కెఎస్‌ఆర్‌టిసి)కు చెందిన బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని సిఎం విజయన్ నేతృత్వంలో ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. 2025 నాటికి తీవ్ర పేదరికాన్ని నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన కార్యక్రమాలను దశలవారీగా ప్రారంభించనున్నట్లు కేరళ ప్రభుత్వం పేర్కొంది.

బిజెపి రాష్ట్ర కొత్త కార్యవర్గం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి రాష్ట్ర కొత్త కార్యవర్గాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఉపాధ్యక్షులుగా పివిఎన్ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వి సూర్యనారాయణరాజు, ఆదినారాయణరెడ్డి, విష్ణుకుమార్‌రాజు, శ్రీదేవి రేలంగి, అయ్యాజి వేమ, కొత్తపల్లి గీత, వాకాటి నారాయణరెడ్డి, కోడూరి లక్ష్మీనారాయణ, చందు సాంబశివరావు, పార్టీ ప్రధాన కార్యదర్శులుగా కాశీ విశ్వనాథ్‌రాజు, బిట్ర శివన్నారాయణ, ఎస్ దయాకర్‌రెడ్డి, గారపాటి తపన చౌదరి, వీరితో పాటు పలువురిని కార్యదర్శులుగా నియమించారు.

రిటైర్డు ఐపిఎస్‌లకు సత్కారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఐపిఎస్ అధికారులుగా వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్డు అయిన ఐపిఎస్ అధికారులు కెఆర్ఎం కిషోర్‌కుమార్, కెఎల్ రంగారావును రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. శుక్రవారం మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో ఈ మేరకు వారికి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి సత్కరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో అత్యంత ప్రతిభావంతంగా విధులు నిర్వర్తించిన కిశోర్‌కుమార్, రంగారావు రిటైర్డు అయ్యాక కూడా మంచి జీవితాలను పొందాలని డిజిపి ఆకాంక్షించారు. అలాగే 2010 కర్నాటక కేడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి, తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పి సిహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి మూడేళ్ల డిప్యూటేషన్ కాలం ముగియడంతో ఆయనకూ డిజిపి కార్యాలయం వీడ్కోలు పలికింది.

జాతీయ సమైక్యత పెంపొందించేందుకే సద్భావన్ దివస్ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని జాతీయ సమైక్యత, మత సామరస్యాన్ని కాపాడే సద్భావన్ దివస్‌గా ప్రతి ఏడాది ఆగస్టు 20న నిర్వహిస్తుండగా.. ఈ ఏడాది 20న ఆదివారం రావడంతో శుక్రవారం సద్భావన్ దివస్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లు విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. రాజ్యాంగ మూలాల ద్వారా అన్ని తేడాలను పరిష్కరించుకోవాలని, అందరికీ శాంతి, శ్రేయస్సు ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేయాలని డిఆర్ఎం సమావేశంలో సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సద్భావన్ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం ఆపరేషన్స్ ఎం శ్రీకాంత్, ఎడిఆర్ఎం మౌలిక సదుపాయాలు డి శ్రీనివాసరావు, డివిజన్ ప్రజా సంబంధాల అధికారి నుస్రత్ ఎం మండ్రుప్కర్ పాల్గొన్నారు.

పవన్‌పై కేసు విచారణను స్వీకరించిన కోర్టు

- వలంటీర్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - విజయవాడ

వలంటీర్ వ్యవస్థ గురించి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై విజయవాడ సివిల్ కోర్టులో దాఖలైన క్రిమినల్ డిఫమేషన్ కేసును కోర్టు విచారణకు స్వీకరించింది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఓ మహిళా వలంటీర్ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్‌పై కేసు పెట్టిన వలంటీర్ స్టేట్‌మెంట్‌ను న్యాయమూర్తి రికార్డు చేశారు. సచివాలయ వలంటీర్లపై పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలతో తాను మానసిక వేదనకు గురయ్యానని, తనకు న్యాయం చేయాలని కోర్టుకు వలంటీర్ విన్నవించారు. విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

డిసెంబరు 31 నాటికి పనిచేస్తున్న

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎవి నాగేశ్వరరావు



ధర్నాకు సంఘీబావం తెలుపుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 2022 డిసెంబరు 31 నాటికి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఉద్యోగి 3 లేదా 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వెంటనే రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం నిర్దిష్ట ఉత్తర్వులు ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ప్రభుత్వ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో శుక్రవారం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు, ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిద శాఖలు, విద్యుత్తు, ఆర్‌టిసి,టూరిజం, హౌసింగ్ వంటి 26 ప్రభుత్వ రంగ సంస్థలు , మున్సిపల్, పంచాయితీ వంటి స్థానిక సంస్థలు, కస్తూరిబా, ఎపి సాక్స్, సాంఘిక, గిరిజన, బిసి సంక్షేమ తదితర ప్రభుత్వ సొసైటీలు, సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధిహామీ, వెలుగు , యూనివర్శిటీలు, టిటిడి వంటి ధార్మిక సంస్థల్లో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కింద అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. 2014 జూన్ 2 నాటికి పనిచేస్తున్న 10,117మందిని మాత్రమే రెగ్యులర్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీవ్ర ఆందోళనకు, అసంతృప్తికి దారి తీస్తుందన్నారు, మిగిలిన వారందరినీ కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి, ఆనాటి ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే సమానపనికి సమానవేతనం చెల్లిస్తామని ప్రకటించారని, కానీ నేటికీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలుకు నోచుకోలేదన్నారు. కాంట్రాక్టు , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వీలుగా మంత్రి వర్గ ఉప సంఘం, ఉద్యోగ సంఘ నేతలను చర్చలకు పిలవాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. టైమ్‌స్కేల్ , డైలీవేజ్, కంటింజెంట్ క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఆప్కాస్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, పెన్షన్ , రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సాధారణ , అనారోగ్య సెలవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, ఇపిఎఫ్, ఇఎస్‌ఐ పథకాలను కాంట్రాక్టు, పార్ట్ టైమ్, గెస్ట్ ఉద్యోగులందరికీ అన్ని పథకాలు అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జెఎసి వైస్ ఛైర్మన్ సిహెచ్ దేవేంద్ర, ఆప్కాస్ వైస్ ప్రెసిడెంట్ పి. వెంకట సుబ్బయ్య, సెక్రటరీ ఎం. రవిప్రకాశ్‌తో పాటు అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

- 24న చలో విజయవాడ
- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, అప్పటికీ ప్రభుత్వం పరిష్కరించకుంటే కలిసొచ్చే సంఘాలను కలుపుకుని నిరవధిక సమ్మెకు వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం వడ్డేశ్వరంలోని మున్సిపల్ సిఅండ్‌డిఎంఎ కార్యాలయంలో డిఎంఎ కోటేశ్వరరావుకు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు గార్లపాటి లక్ష్మి, వెంగమ్మ, రాము, రాజేష్‌కు ఫెడరేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టైమ్‌స్కేల్ వర్తింపజేయాలని, వెంటనే పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమిస్కిల్డ్, అన్‌స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.18,500 జీతం ఇవ్వాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని, రక్షణ, భద్రతా సౌకర్యాలు, పనిముట్లు సకాలంలో అందించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూములు దోచిపెట్టడం సరికాదు

- సిపిఎం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వ భూములను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరుడు బొత్స సత్యనారాయణకు కారు చౌకగా దోచిపెట్టడం సరికాదని సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. పారిశ్రామికాభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వాస్తవ ధరకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యుల పేరిట ఏర్పాటు చేస్తున్న సత్య బయో ఫ్యూయల్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు సుమారు రూ.21.66 కోట్ల విలువైన 30 ఎకరాల భూమిని..ఎకరా రూ.10 లక్షల చొప్పున ఎపిఐఐసి కేటాయించినట్టు వచ్చిన వార్తలపై ఆయన పై విధంగా స్పందించారు. గ్రోత్ సెంటర్ పరిసర ప్రాంతంలో ఎకరా భూమి రూ. రెండు కోట్ల నుంచి రూ. మూడు కోట్లు పలుకుతుందని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇలా ప్రజాధనాన్ని లూటీ చేయడం తగదన్నారు.

కారుచౌకగా కట్టబెట్టడతారా?

పరిశ్రమ ఏర్పాటు పేరిట రూ.కోట్ల విలువ చేసే భూమలును బొత్స కుటుంబ సభ్యులకు కారుచౌకగా కేటాయించడం పట్ల టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని సిఎం దోచిపెడుతున్నారని విమర్శించారు. ఈ జిఒను రద్దుచేయకపోతే పోరాడతామని హెచ్చరించారు.

బోనులో చిక్కిన ఎలుగుబంటి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం పరిధిలోని శిఖరేశ్వరం సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి శుక్రవారం బోనుకి చిక్కింది. గత రెండు రోజుల నుంచి శిఖరేశ్వరం సమీపంలో ఎలుగుబంటి సంచరించడంతో సందర్శకులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిఖరేశ్వరం సమీపంలో మూడు బోన్లను ఏర్పాటు చేశారు. శ్రీశైలం పరిధిలో చిరుత కూడా సంచరించడంతో అధికారులు, సందర్శకులను అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అలాంగ్ చాంగ్ తెరాన్ అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ఎలుగుబంటి బోనులో చిక్కింది. తిరుపతిలో జరిగిన ఘటనల దృష్ట్యా శ్రీశైలంలో ఆధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రమ దోపిడీ, అభద్రతా భావంలో నెట్టివేసేలా ఉన్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. అనంతపురంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మూడు లక్షలకు పైగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు 25 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారని తెలిపారు. వైసిపి మాత్రం రాబోయే ఎన్నికల కోసం పది వేల మందిని రెగ్యులరైజ్ చేస్తామని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. శాశ్వత పనుల్లో విధులు నిర్వహించేవారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల పక్షాన కొమ్ముకాస్తూ పర్మినెంట్ చేసే విధానాన్ని పక్కన పెట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కార్మికులు, విఆర్ఎలను పర్మినెంట్ చేసిందని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికులకు వర్తించే 70 షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించిన కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. వేతనాల బోర్డ్ కమిషన్ చైర్మన్లను నామమాత్రంగా నియమించారే తప్ప ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. దీన్నిబట్టి ప్రభుత్వాలకు కార్మికుల సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీసత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి తాగునీటి సరఫరా పథకంలోని కార్మికులు చేసిన పనులకు వేతనాలు కోసం రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. విలేకర్ల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.



తీర్పు సమయంలో కోర్టుకు హాజరైన సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

సిపిఎం నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - విజయవాడ

కరోనా నిబంధనలను ఉల్లంఘించారంటూ, కరోనా విస్తరణకు కారణమయ్యారంటూ సిపిఎం నేతలపై పెట్టిన అక్రమ కేసును శుక్రవారం విజయవాడ కోర్టు కొట్టివేసింది. 2020లో కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ సమయంలో విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేటలోని పేదలకు సిపిఎం, ప్రజా సంఘాల నేతలు దాతల సహకారంతో పలు రోజులపాటు భోజన ఏర్పాట్లు చేశారు. కరోనాలో ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా సేవా కార్యక్రమాలు చేపట్టారు. కరోనా విస్తరించకుండా ప్రజలను చైతన్యపరిచారు. కరోనా నిబంధనలను ఉల్లంఘించారని, కరోనా విస్తరణకు కారణమయ్యారంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, స్థానిక నేతలు టి.శ్రీనివాస్, దమ్మాసి రమణ, డివైఎఫ్ఐ నాయకులు ఎస్‌కె.నిజాముద్దీన్, సిఐటియు నాయకులు ఎంవి.రమణపై ఐపిసి సెక్షన్ 341, 143, 188, 268, 269, 270, సెక్షన్ 3-ఎపెడమిక్ డిసిజెస్ యాక్ట్ కింద పోలీసులు కేసులు పెట్టారు. అప్పటి నుండి ఈ కేసుపై విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. విచారణ అనంతరం ఈ కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో సిపిఎం నేతల తరపున ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, ఎస్.రమేష్ వాదించారు. న్యాయ సహకారం అందించిన న్యాయవాదులకు సిపిఎం, ప్రజా సంఘాల నేతలు ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పాలకుల నిర్లక్ష్యంతోనే ఉత్తరాంధ్ర వెనుకబాటు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు గురైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి నినాదంతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం శ్రీకాకుళం నగరానికి చేరుకుంది. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాలలోని సిల్వర్‌జూబ్లీ హాల్‌లో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం వెనుకబాటుకు వనరులు లేకపోవడం ఒక కారణమని, ఉత్తరాంధ్రలో అందుకు భిన్నంగా అన్ని వనరులున్నా అభివృద్ధి చేయాలన్న ఆలోచన, ప్రణాళిక పాలకుల్లో కొరవడిందని అన్నారు. సుమారు మూడు లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉందని, 19 నదులు ఈ ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తున్నా ఒక్క టిఎంసి నీటినీ ఒడిసిపట్టి రైతాంగానికి అందించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను సాధిస్తానన్న జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని పక్కనపెట్టి మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నారని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో సుమారు 350 కిలోమీటర్ల పొడవున సముద్రతీరం ఉన్నా, మత్స్యకారులు వలసలు పోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే నాణ్యమైన పలాస జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి నిరోధక పాలన సాగుతోందని విమర్శించారు.

సిపిఐ నాయకులు జె వి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఆలిండియా కిసాన్ మోర్చా అధ్యక్షులు రావుల వెంకయ్య, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, నల్లి ధర్మారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ప్రజాశక్తి-ఓబుళదేవర చెరువు : అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం బాసప్పగారిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... టి కుంట్లపల్లి పంచాయతీ బాసప్పగారిపల్లికి చెందిన రైతు పి ఆంజనేయులు (59)కు మూడెకరాల పొలం ఉంది. వర్షాధారంగా వేరుశనగ పంటను సాగు చేస్తుండేవారు. సాగు నిమిత్తం వేసిన మూడు బోర్లలోనూ నీరు పడలేదు. పంట సాగు, బోర్లు వేసేందుకు రూ.ఐదు లక్షల వరకు అప్పులు చేశారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో పాడి ఆవును రూ.70 వేలకు కొనుగోలు చేశారు. ఇది ఇటీవల మృతి చెందింది. అన్ని విధాలా నష్టాలు రావడంతో అప్పులు తీర్చడం కష్టంగా మారింది. దీంతో, మనస్తాపం చెంది తన వ్యవసాయ పొలానికి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆంజనేయులుకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దళిత మహిళపై దాడి ఆటవిక చర్య

- కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్ నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)

దళిత మహిళను వివస్త్రను చేసి స్తంభానికి కట్టివేయడం ఆటవిక చర్య అని కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్ నాయకులు అన్నారు. బాధితులను పలకరించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం బొట్లపాలెంకు చెందిన బాధిత దళిత మహిళ కుటుంబాన్ని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావు శుక్రవారం పరామర్శించారు. అనంతరం డిఎస్‌పి ఆశోకవర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బొట్లపాలెంకు చెందిన దళిత యువకుడు అదే గ్రామానికి చెందిన పెత్తందారు యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. పెత్తందారులు ఈ విషయాన్ని జీర్ణించుకోలేక ఈ నెల 14 దళిత యువకుడి తల్లి, అక్క కళ్లలో కారం చల్లి గొడ్డలితో దాడి చేశారని, అనంతరం అక్కను వివస్త్రను చేసి స్తంభానికి కట్టివేసి కొట్టారన్నారు. ఈ ఘటనపై పోలీసులు 307 సెక్షన్ కాకుండా సాధారణ కేసు కట్టి మళ్లీ కౌంటర్ కేసు నమోదు చేశారని తెలిపారు.

ఎవరిని కదలించినా కన్నీళ్లే!

• ఏచూరి నేతృత్వంలోని సిపిఎం బృందం తొలిరోజు పర్యటనలో దృశ్యాలు • బాలింతలకు సౌకర్యాలు కరువు • ఆ శిశువులే వారి ఆశాదీపాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మూడు మాసాలైనా మణిపూర్ ప్రజలను భయం, అభద్రత ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. బాధితులను పరామర్శించేందుకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేతృత్వంలోని ఆ పార్టీ ప్రతినిధి బృందం రెండురోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం అక్కడికి వెళ్లింది. తొలిరోజు చురచంద్‌పూర్‌లో సహాయక శిబిరాలను సందర్శించిన బృందం బాధితులెవరిని కదిలించినా కన్నీళ్లు, రోదనలే. వారిని ఓదార్చి, మీకు అండగా ఉన్నామని భరోసా ఇచ్చింది.

సహాయక శిబిరాల్లో పసికందుల పరిస్థితి మరీ దారుణం. సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు ఆ శిశువులే ఆశాదీపాలు. చురచంద్‌పూర్‌లోని సెహాన్, చంపై క్యాంపుల్లోనే మూడున్నర నెలల్లో 12 మంది శిశువులు జన్మించారు. అల్లర్లు చెలరేగిన మే 3వ తేదీ రాత్రి జైడెన్ హమార్ యూత్ అసోసియేషన్ హాల్‌లో శిబిరం ప్రారంభమైంది. ఆ శిబిరాన్ని సందర్శించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేతృత్వంలో బృందానికి అక్కడి పరిస్థితి గురించి సహాయక సిబ్బంది వివరిస్తూ... "తల్లులు, శిశువులకు సరైన వైద్య సాయం అందలేదన్నారు. శిబిరంలోని చాలా ఇళ్లు కాలిబూడిదయ్యాయి. శుక్రవారం మరో ముగ్గురు కుకీలు హత్యకు గురికావడంతో వారిలో ఆందోళన, భయం మరింత పెరిగింది. ఒకటిన్నర నెలల పసికందు చంపై స్కూల్ నిర్వహిస్తున్న శిబిరంలో ఉంది. తల్లి లింగనేలమ్మ ఆసుపత్రిలో ఈ పాపకు జన్మనిచ్చింది.



సహాయక శిబిరంలో చిన్నారిని పరిశీలిస్తున్న సీతారాం ఏచూరి

ఈ ప్రతినిధి బృందంలో సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, అస్సాం రాష్ట్ర కార్యదర్శి సుప్రకాష్ తాలుక్దార్, కేంద్ర కమిటీ సభ్యురాలు డెబ్బీనా హెంగ్రామ్ తదితరులు ఉన్నారు. ఈ బృందం శుక్రవారం రాత్రి గవర్నర్ అనసూయ ఉయికేతో సమావేశమైంది.

మణిపూర్ లో పరిస్థితి ప్రమాదకరంగా ఉంది : సీతారాం ఏచూరి

మణిపూర్ లో పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, దేశ ఐక్యత కోసం దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. "తమ సంఘీభావం తెలిపేందుకు, మద్దతు ఇచ్చేందుకు వచ్చామన్నారు. మణిపూర్ సోదరు, సోదరీమణులంతా ఇండియా కుటుంబంలో భాగమేనని, వారిని కలిసి ఓదార్చుతామన్నారు. భారతదేశం మీ వెంటే ఉందని వారికి చెబుతున్నాం. మణిపూర్ లో శాంతి, సాధారణ పరిస్థితి పునరుద్ధరించాలి " అని అన్నారు. ముఖ్యమంత్రి ఎన్. బీరేన్‌సింగ్‌ను బర్తరఫ్ చేయాలనే ప్రతిపక్షాల డిమాండ్‌ను ఆయన పునరుద్ఘాటించారు. "రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ బిజెపి ప్రభుత్వంతో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉంది. కాబట్టి ఇక్కడి పరిస్థితులకు వారే పూర్తి బాధ్యత వహించాలి. సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో సహాయం కోసం మా వంతుగా అవసరమైనది చేయడానికి మేము సిద్ధం. హింస చాలా కాలంగా కొనసాగుతోంది. దీనిని తక్షణమే ఆపాలి" అని ఏచూరి అన్నారు.

లాలూ బెయిల్‌పై సుప్రీంకోర్టుకు సిబిఐ

న్యూఢిల్లీ : మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కి మంజూరైన బెయిల్‌ను సవాలు చేస్తూ శుక్రవారం సిబిఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఆగస్టు 25న విచారించనుంది. పశుదాణా కుంభకోణానికి సంబంధించిన నాలుగు కేసుల్లో జార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, 2021 ఏప్రిల్‌లో ఆయన విడుదలయ్యారు. గతేడాది డిసెంబరులో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సిబిఐ అప్పీల్‌ను శుక్రవారం విచారించాలని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని సిబిఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ కోరారు. 25న పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇటీవల ఏర్పాటైన 'ఇండియా' కూటమి కీలక నేతలలో లాలూ ప్రసాద్ ఒకరు.

2024లో అమేథి నుంచి రాహుల్ పోటీ

లక్నో : 2024 లోక్‌సభ ఎన్నికల్లో అమేథి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ పోటీ చేయనున్నారని ఉత్తరప్రదేశ్ పిసిసి అధ్యక్షులు అజయ్ రాయ్ శుక్రవారం తెలిపారు. అలాగే.. 'ప్రియాంక గాంధీ వారణాసి నుంచి పోటీ చేయాలనుకుంటే, ప్రతి కార్యకర్త ఆమె విజయానికి సర్వశక్తులు ఒడ్డి కృషి చేస్తారు' అని చెప్పారు. ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ 'కుల, మతాలకు అతీతంగా వారణాసి పార్లమెంటరీ నియోజకవర్గ ఓటర్లు ప్రియాంక గాంధీని తమ అభిమాన అభ్యర్థిగా అంగీకరిస్తారు. ప్రధాని మోడీపై ప్రియాంక విజయం సాధిస్తారు' అని చెప్పారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాయ్ ఇటీవలే ఉత్తరప్రదేశ్ పిసిసి అధ్యక్షులుగా నియమితులయ్యారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి మోడీ చేతిలో రాయ్ ఓటమి చవిచూశారు.

బీహార్ జర్నలిస్టు కాల్చివేత



పాట్నా : బీహార్‌లోని అరారియా జిల్లాలో దైనిక్ జాగరణ్ వార్తాపత్రికకు చెందిన స్థానిక జర్నలిస్టు విమల్ కుమార్ యాదవ్ (35)ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం కాల్చి చంపారు. విమల్ మృతికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో విమల్ కుమార్ యాదవ్ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తలుపుతట్టారు. యాదవ్ తలుపు తీయగానే ఆయనను కాల్చి చంపారు. సంఘటనా స్థలానికి ఎస్‌పి అశోక్‌కుమార్ సింగ్, ఫోరెన్సిక్ బృందం, డాగ్ స్క్వాడ్ చేరుకున్నారు. శవపరీక్ష కోసం మృతదేహాన్ని ఫోరెన్సిక్ బృందానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. రెండేళ్ల క్రితం సర్పంచ్‌గా ఉన్న విమల్ సోదరుడు కూడా ఇలాగే హత్యకు గురయ్యాడు. ఈ కేసులో చంపేస్తామని బెదిరించినప్పటికీ విమల్ కోర్టులో హంతకుడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు. ఈ నేపథ్యంలోనే అతను హత్యకు గురైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణ తేలింది.

యాంత్రికంగా ఫార్వర్డ్ చేసినా తప్పే : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : అసభ్యకరమైన, అవమానకరమైన సోషల్ మీడియా పోస్టులను చదవకుండా లేదా ఆలోచించకుండా యాంత్రికంగా ఫార్వర్డ్ చేయడం కూడా తప్పేనని, పర్యవసానాలను ఎదుర్కోనాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నటుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి శేఖర్ కేసులో జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ పికె మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని తెలిపింది. మహిళా జర్నలిస్టుల గురించి అసభ్యకరమైన పోస్టులను ఫార్వర్డ్ చేసినట్లు శేఖర్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 'తాను కంటికి చుక్కలు మందు వేసుకున్నానని, ఆ సమయంలో తన వేళ్లు పొరపాటున 'సెండ్' బటన్ నొక్కినట్లు' శేఖర్ వాదనలు వినిపించారు. 'కళ్లకు చుక్కల మందు వేసుకున్న సమయంలోనూ సోషల్ మీడియా ఎందుకు చూశారని' ధర్మాసనం తిరిగి ప్రశ్నించింది. సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు నిర్ణయంపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. శేఖర్‌పై నమోదైన క్రిమినల్ కేసులను రద్దు చేయడానికి ధర్మాసనం అనుమతించలేదు.

వ్యవసాయ కార్పొరేటీకరణకు కుట్ర

• రిపోర్టర్స్ కలెక్టివ్ నివేదిక ఆధారంగా జెపిసితో దర్యాప్తు : ఎఐకెఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : భారత దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జరుగుతున్న ప్రయత్నాలను విరమించుకోవాలని మోడీ ప్రభుత్వాన్ని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. ఇప్పటివరకూ ఉన్న ప్రభుత్వ విధానాలన్నింటినీ ధ్వంసం చేసి, రైతాంగ వ్యతిరేక నిరంకుశ చట్టాలను తీసుకువచ్చేలా బడా వాణిజ్య సంస్థలు, వారికి సహకరించే ఎన్‌ఆర్‌ఐల చర్యలపై దర్యాప్తు చేసేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేయాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. భారతీయ వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడం కు మోడీ ప్రభుత్వం, నీతి ఆయోగ్, అదానీ నేతృత్వంలో ప్రముఖ కార్పొరేట్లు కలిసి పన్నిన నీచపుటెత్తుగడలను ఇటీవల రిపోర్టర్స్ కలెక్టివ్ జరిపిన దర్యాప్తు బట్టబయలు చేసింది. ప్రాముఖ్యత కలిగిన ఈ జర్నలిస్టుల దర్యాప్తును ఎఐకెఎస్ అభినందించింది. ఈ దర్యాప్తు వివరాలను రెండు భాగాలుగా విడుదల చేశారు. బిజెపికి మిత్రుడు, వ్యవసాయ రంగం, అందుకు సంబంధించిన అంశాలు, రంగాల గురించి ఎలాంటి అనుభవం, నైపుణ్యం లేని, సాఫ్ట్‌వేర్ వ్యాపారవేత్త శరద్ మరాఠే వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే ఆలోచనలను ప్రమోట్ చేయడంలో ఎలా కీలక వ్యక్తిగా వ్యవహరించారో దర్యాప్తు మొదటి భాగం వివరించింది. మరాఠే దీనిపై ఒక కాన్సెప్ట్ నోట్‌ను సమర్పించారు. దాని ప్రాతిపదికన నీతి ఆయోగ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్)ను ఏర్పాటు చేసింది.. ఈ టాస్క్‌ఫోర్స్‌కి నాయకత్వం వహించే అశోక్ దాల్వాయి రైతుల ఆదాయాలను రెట్టింపు చేసే మంత్రివర్గ కమిటీకి ఛైర్మన్‌గా కూడా వుండడం ఆసక్తికరమైన అంశం. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ వుంచడంపై ఆంక్షలను ఎత్తివేసేందుకు 2018 ఏప్రిల్‌లో ప్రభుత్వంతో గుత్తాధిపత్య సంస్థలు, ముఖ్యంగా అదానీ గ్రూపు ఎలా లాబీయింగ్ చేసిందో దర్యాప్తు రెండో భాగం వివరించింది.

బీహార్ కులాల సర్వేపై స్టేకు సుప్రీం నో

న్యూఢిల్లీ : బీహార్‌లో జరుగుతునన కుల సర్వేపై స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. సర్వే సందర్భంగా కులం లేదా ఉప కులం వివరాలను ఒక వ్యక్తి అందించినా ఆ వ్యక్తిగత డేటాను ప్రభుత్వం ప్రచురించనప్పుడు జరిగే ప్రమాదం ఏమిటని సుప్రీం కోర్టు శుక్రవారం ప్రశ్నించింది. కులాలవారీగా సర్వే చేట్టేందుకు ఆమోదిస్తూ పాట్నా హైకోర్టు ఆగస్టు 1న తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టిలతో కూడిన బెంచ్ శుక్రవారం విచారణ ప్రారంభించింది. ఈ ప్రక్రియ వ్యక్తుల గోప్యతా హక్కును ఉల్లంఘించడమేనంటూ కొన్ని పిటిషన్లు పేర్కొన్నాయి. "విడుదల చేయాలనుకున్నవి సామూహిక గణాంకాలు, అటువంటప్పుడు అది గోప్యతా హక్కును ఎలా ప్రభావితం చేస్తుంది? సర్వేలో సిద్ధం చేసిన ప్రశ్నావళిలో ఏ ప్రశ్నలు రాజ్యాంగంలోని 21వ అధికరణ (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ)కు విరుద్ధంగా వున్నాయనుకుంటున్నారు?" అని ఎన్‌జిఓ 'యూత్ ఫర్ ఈక్వాలిటీ' తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్యనాథన్‌ను బెంచ్ ప్రశ్నించింది. మరో పిటిషనర్ తరపు న్యాయవాది అపరాజితా సింగ్ మాట్లాడుతూ, ఈ ప్రక్రియ పూర్తయిందని తెలిసిందని, డేటా ప్రచురణపై స్టే విధించాలని కోరుతున్నామని అన్నారు. బీహార్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ మాట్లాడుతూ, ఆగస్టు 6తో కుల సర్వే పూర్తయిందని, 12వ తేదీకల్లా డేటాను అప్‌లోడ్ చేశామని చెప్పారు. బీహార్ జాతి ఆధారిత్ గణన యాప్‌లో ఈ డేటాను పెట్టారు.

'సాగర్' ఆయకట్టులో సంక్షోభ ఛాయలు

(మొదటి పేజీ తరువాయి)

215.80 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 108.75 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. ఈ జలాశయానికి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో రావడం లేదు. గతేడాది ఆగస్టు 18 నాటికి 211.48 టిఎంసిల నీరు నిల్వ ఉంది. సాగర్ జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 312.04 టిఎంసిలు. ప్రస్తుతం 148.73 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే రోజుకు 296.86 టిఎంసిలు ఉండేవి. ఆల్మట్టిలో గరిష్ట నీటి నిల్వ 129.72 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 128.19 టిఎంసిలు ఉన్నాయి. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరగకపోవడంతో దిగువకు నీటిని విడుదల చేయడం లేదు. ఇదే పరిస్థితి నారాయణ్‌పూర్, జూరాల జలాశయాల వద్ద కూడా ఉంది. గతేడాది ఆగస్టు మొదటి వారంలోనే కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టుకు నీరు రావడం ప్రారంభమైందని, ఈ ఏడాది ఆల్మట్టి నుంచి నీటి విడుదల జరిగితేనే సాగర్ ఆయకట్టు రైతులకు ఇబ్బంది ఉండదని, అప్పటి వరకు వేచిచూడక తప్పదని అధికారులు చెప్తున్నారు.

మణిపూర్‌పై జోక్యం చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

లేకపోయిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పు లేదని, రాష్ట్రాన్ని సందర్శించి అక్కడి ప్రజలతో ముఖ్యంగా మహిళలతో మమేకమైతేనే మణిపూర్‌లో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోగలం" అని తెలిపారు.

దు:ఖసాగరంలో మణిపూర్

"మణిపూర్ రాష్ట్రం దు:ఖసాగరంలో ఉంది. పరస్పరం శాంతి సామరస్యాలతో జీవించిన ప్రజల మధ్య విద్వేషాగ్నులు రగుల్కొన్నాయి. ఇప్పుడు రెండు వైపులా భయం, అపనమ్మకం, అనుమానాలు ఉన్నాయి. భౌగోళికంగా ఇది ఆయా తెగలు నివసించే రెండు ప్రాంతాల మధ్య జాతీయ సరిహద్దులా మారింది. ఎవరినీ ఈ సరిహద్దును దాటడానికి అనుమతించరు. దాదాపు ఐదు వేల కాలనీలు, అనేక గ్రామాలు కాలిబూడిదయ్యాయి. ఇరు తెగలకు చెందిన వేలాది మంది ప్రజలు తమ ఇళ్లను విడిచిపెట్టి సహాయక శిబిరాల్లో ఉన్నారు. ఆదివాసీలపై దాడులు మితిమీరుతున్నాయి" అని పేర్కొన్నారు.

మహిళల నరకయాతన

మణిపూర్‌లో అనాగరిక దాడులతో మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారని, వారికి న్యాయం చేయాలని ఆ మెమొరాండంలో ఐద్వా కోరింది. సామూహిక అత్యాచారం నుంచి కుమార్తెను, భార్యను రక్షించే క్రమంలో తండ్రి, కొడుకు దారుణ హత్యకు గురయ్యారు. మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారని తెలిపింది. మీరు జోక్యం చేసుకుని కడచూపునకు నోచుకునే అవకాశం కల్పించాలని కోరింది.

ప్రజలను రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

"ప్రజలను రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బీరెన్ సింగ్ ప్రభుత్వం నిష్క్రియాత్మకంగా అడుగడుగునా స్పష్టంగా కనిపిస్తోంది. కాబట్టి ముఖ్యమంత్రిని తొలగించడం అత్యంత ఆవశ్యకమని ఐద్వా పేర్కొంది.

సహాయక శిబిరాల భయంకరమైన స్థితి

"మణిపూర్‌లోని 350 సహాయ శిబిరాల్లో 55 వేల మందికి పైగా బాధితులు ఉన్నారు. మూడు నెలల నుంచి ఎలాంటి పరిష్కారం కనిపించకపోవడంతో వారు ఈ సహాయక శిబిరాల్లోనే మగ్గుతున్నారు. అక్కడి పరిస్థితి దారుణంగా ఉంది. వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. శిబిరాలు మరుగుదొడ్లులా తయారవుతున్నాయి. అక్కడ సరైన సౌకర్యాలు లేవు. స్నానం చేయడం, బట్టలు మార్చుకోవడం, విశ్రాంతి కోసం పడుకోవడం మొదలైన సాధారణ రోజువారీ కార్యకలాపాలు పెద్దలతో సహా అందరి ముందు చేయాలి. వారి ఆత్మగౌరవాన్ని, గౌరవాన్ని కోల్పోతున్నారు. కొండ ప్రాంతాల్లో ఇప్పటికీ పిల్లలు బడి బయటే ఉన్నారు. ఆహారం, పోషకాహారం అందటం లేదు. ప్రజలు మూడు నెలలుగా పప్పు, అన్నం మాత్రమే తింటున్నారు" అని వివరించారు.

వందల కుటుంబాలు రోజుకు ఒక్కపూటే భోజనం

"ఈ సహాయక శిబిరాల్లో కాకుండా సొంత ఇళ్లలోనే ఉన్నవారు ఉపాధి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. అనేక కుటుంబాలు రోజుకు ఒక్కసారే భోజనం చేస్తున్నాయి. రేషన్ ధాన్యాలు నిలిచిపోయాయి. కోవిడ్ కాలంలో ప్రారంభించిన ఐదు కిలోల బియ్యం మాత్రమే ఇస్తున్నారు" అని తెలిపారు.

తక్షణమే పరిష్కరించాల్సిన కొన్ని సమస్యలు

బాధితులకు న్యాయం జరగాలంటే ఈ దారుణాలకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఐద్వా కోరింది. వీడియోలలో ఇప్పటికే గుర్తించబడిన వారిని కూడా అరెస్టు చేయలేదు. ఆస్తి దగ్ధం, దోపిడీ విషయంలో ఇరువైపులా జరిగిన నష్టాలను సరైన అంచనా వేసి తగిన పరిహారం ఇవ్వాలి. ఇళ్లు కాలిపోయిన వారందరికీ పునరావాస ప్రక్రియ చేపట్టాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరింప చేయాలి. రేషన్ కోటాలను ఒక్కొక్కరికి పది కిలోలకు పెంచాలి. భారీ నిరుద్యోగం, తీవ్రమైన ఆదాయ నష్టం ఉన్నందున నగదు బదిలీలు తక్షణం చేయాలి. విద్యార్థులందరి విద్యను పున్ణప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. వైద్య సదుపాయాలు క్షీణించిన గిరిజన ప్రాంతాలకు అత్యవసరంగా వైద్యులను పంపించాలి" అని విజ్ఞప్తి చేశారు.

వైఎస్ షర్మిల గృహ నిర్బంధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించేందుకు వెళ్లాలనుకున్న వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ (వైటిపి) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను శుక్రవారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. దళితబంధులో అక్రమాలు జరిగాయంటూ ఇటీవల గజ్వేల్‌లోని జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామస్తులు ఆందోళన చేశారు. వారికి మద్దతుగా అక్కడ పర్యటించాలని నిర్ణయించుకున్న షర్మిలను అనుమతి లేదంటూ పోలీసులు గృహనిర్బంధం చేశారు. లోటస్‌పాండ్‌లోని ఆమె నివాసం వద్ద పోలీసులు మోహరించారు. గజ్వేల్ వెళ్లి తీరుతానంటూ పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగారు. అనుమతి లేదని పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో పోలీసులకు షర్మిల హారతి ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. డ్యూటీ సరిగా చేయండి సార్ అని వ్యాఖ్యానించారు. గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న బిఆర్‌ఎస్ నేతలను ఎందుకు అరెస్టు చేయడంలేదని ప్రశ్నించారు. పోలీసులు సిఎం కెసిఆర్ తొత్తుల్లా పనిచేయడం మానుకోవాలన్నారు. కెసిఆర్ తనను చూసి భయపడుతున్నారని అన్నారు. గజ్వేల్ పర్యటనను అడ్డుకున్నందుకు నిరసనగా తన నివాసం వద్దే ఆమె దీక్షకు దిగారు.

మళ్లీ పేలిన గుజరాత్ బుడగ

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం 2015-16లో 18.47 శాతం ఉండగా, 2019-21లో 11.66 శాతంగా ఉంది. గుజరాత్ కంటే మహారాష్ట్ర (7.81 శాతం), ఆంధ్రప్రదేశ్ (6.06 శాతం), పంజాబ్ (4.75 శాతం), తమిళనాడు (2.20 శాతం), కేరళ (0.55 శాతం), కర్ణాటక (7.58 శాతం) రాష్ట్రాలు మెరుగైన పనితీరు కనబరిచాయి. గుజరాత్‌లోని దాహోద్‌ల అత్యధిక పేదరికం నిష్పత్తి 38.27 శాతం ఉండగా, నవ్‌సారిలో అత్యల్పంగా 4.84 శాతం నమోదైంది. బహుముఖ పేదల సంఖ్య గుజరాత్‌లో వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా ఉండటంతో పాటు, పట్టణ ప్రాంతాలు అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్‌ల్లో కేంద్రీకృతమైందని నివేదిక తెలిపింది. హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ కంటే గుజరాత్‌లో బహుముఖ పేదల సంఖ్య ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది. అలాగే ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే గుజరాత్‌లో పేదలు పేదలుగానే మిగిలిపోతున్నారని నీతి ఆయోగ్ నివేదిక సూచిస్తుంది.

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. దీంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి నుంచి కురిసిన వర్షానికి నేల మెత్తబడిపోవడతో దానవాయిపేటలో భారీ వృక్షం రోడ్డుకడ్డంగా పడిపోయింది. దీంతో, కార్పొరేషన్ సిబ్బంది ఈ వృక్షాన్ని తొలగించారు. వర్షాలకు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తాళ్లపూడి, చాగల్లు, కొవ్వూరు రూరల్, రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతాలు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, అంబాజీపేట, ఆలమూరు, మండపేటల్లో భారీ వర్షం కురిసింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో సుద్ధగడ్డ కాలువకు వరద నీరు పోటెత్తింది. ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రస్తుత వర్షాలకు మెట్టలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొగల్తూరులో వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది. ఉపరితల ఆవర్తనం రెండు, మూడు రోజుల్లో ఉత్తర ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా పయనించే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ సముద్రమట్టం హిమాలయ పర్వత ప్రాంతాల వద్ద ద్రోణి ఉన్నట్లు వెల్లడించింది. ఇది తూర్పు చివర గోరఖ్‌పూర్, డెహ్రీ, రాంచీ, బాలాసోర్ గుండా ఆగ్నేయం దిశగా వాయువ్య బంగాళాఖాతం మీదుగా అల్పపీడన ప్రాంతం మధ్యలోకి పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీర ప్రాంతాల గుండా ప్రయాణం చేస్తోందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ఈ నెల 22 వరకూ వర్షాలకు అవకాశాలున్నాయని వెల్లడించింది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా జిల్లాల్లో రాగల 24 గంటల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు పేర్కొంది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. మత్స్యకారులు రెండు రోజుల వరకూ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఉమర్ ఖలీద్ బెయిల్ విచారణ వాయిదా

న్యూఢిల్లీ : యుఎపిఎ కేసులో జెఎన్‌యు మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు శుక్రవారం వాయిదా వేసింది రెండు వారాల తర్వాత జాబితా చేయాలని జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ బి.త్రివేదిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది.





మీకోసం

గ్లాసులు ఒకదానిలో ఒకటి ఇరుక్కుపోతే ఒక రాత్రంతా వాటిని ఫ్రిజ్‌లో ఉంచితే సులభంగా విడిపోతాయి.

జీవన సౌరభం

వృథా చేసే ప్రతి క్షణం, లక్ష్యాన్ని తారుమారు చేస్తుంది.

చదువు - సంస్కారం



చదువు చక్కని బంగారం
జ్ఞానానికది భాండాగారం
జీవితానికది జీవనాధారం
పదుగురిలో గొప్ప సంస్కారం

చక్కని మాటల నైపుణ్యం
చిక్కని మనసుకు శ్రీకారం
కమ్మని ఆటల ఉల్లాసం
పుస్తకాలతో సావాసం

క్రమశిక్షణకెంతో ఉపయోగం
విచక్షణ గుణమే మమకారం
విలక్షణమైనది ఉద్యోగం
చదువే మనకు పరిజ్ఞానం

అక్షరాలతో మనం మమేకం
మంచి లక్షణాలే వినియోగం
ఉత్తీర్ణతతోనే ఘన విజయం
ఆపై ప్రతిదీ జయం జయం

ప్రపంచ జ్ఞానం మన సొంతం
పరిశుద్ధతకే ఓటేద్దాం
పరిస్థితులను కనుగొందాం
చదివిన చదువుకు విలువిద్దాం


అందరితోను కలిసుందాం
చదువుకొమ్మని సలహానిద్దాం
అల్లరి పనులను మానేద్దాం
అమ్మ నాన్న పేరును నిలబెడదాం

మొరటుతనానికి స్వస్తి చెపుదాం
మేటి తనానికి చేయి కలుపుదాం
రేపటి పౌరులుగా ఎదుగుదాం
భావితరాలకి ఉపయోగపడదాం

నిరక్షరాస్యులను దగ్గర చేర్చుదాం
అక్షరాలను దిద్దించుదాం
అజ్ఞానాన్ని పోగొడదాం
విజ్ఞానులుగా తయారు చేద్దాం

బాగా చదివి పాసవుదాం
నిస్వార్థంగా జీవిద్దాం
అందరి బాగును కోరుకుందాం
వ్యవస్థను చక్కగా నడిపిద్దాం

– నరెద్దుల రాజారెడ్డి
96660 16636



జత చేయండి

పిల్లలూ, ఇక్కడ రంగురంగుల బూరలు ఇచ్చాం. వాటికెదురుగా ఆ రంగుల పేర్లు ఉన్నాయి. సరైనవాటిని జత చేయండి..

నేను గీసిన బొమ్మ



ఎ.శ్రావణి,
5వ తరగతి,
నెహ్రూపేట స్కూలు,
భీమవరం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కాలాన్ని బంధించే కెమెరా



వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఒక ఫొటో చెబుతుంది. వర్తమాన అంశాలని భవిష్యత్తు తరాలకు అందిస్తుంది. మధుర జ్ఞాపకాలను తరతరాలకు భద్రపరుస్తుంది. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం.. ఓ కథ.. ఓ అనుభూతి ఉంటుంది. అలనాటి జ్ఞాపకాల్ని మళ్ళీ మళ్ళీ తనివితీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపిగురుతులు ఫొటోలు మాత్రమే! అందుకనే నేటి దైనందిన జీవితంలో ఫొటోగ్రఫీ ఒక భాగంగా మారింది. ఏటేటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

ఫొటోగ్రఫీ ఓ అందమైన అభిరుచి. ఫొటో అనేది ఒక కాలాన్ని, సందర్భాన్ని శాశ్వతంగా బంధించే సాంకేతిక చమత్కృతి! అందుకనే ఫొటోగ్రఫీ కొందరికి వృత్తి అయితే, ఎందరికో ప్రవృత్తి! అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జన్మించిన అశోక్ బీరా స్పెయిన్ పౌరసత్వం కలిగి ఉన్నారు. అనేక రుగ్మతలపై ఫొటోగ్రఫీ డాక్యుమెంటేషన్ చేస్తూ సమస్యలను ఎత్తిచూపుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కుర్లపాటి సరస్వతిరావు విశ్రాంత బ్యాంకు ఉద్యోగి. ఆర్ట్ ఫొటోగ్రాఫర్‌గా మంచి ఇతివృత్తం ఉన్న ఫొటోలను సేకరిస్తున్నారు. విశాఖపట్టణానికి చెందిన కె.భాస్కరరావు ఐదు దశాబ్దాలపాటు ఫొటో జర్నలిస్టుగా పనిచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వృత్తి నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అయినా మొక్కవోని దీక్షతో తను నమ్మిన వృత్తికి న్యాయం చేస్తున్నారు. ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టు టి.వి.రమణ తన కెమెరా కన్నుతో ప్రజా సమస్యలను చూస్తున్నారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వాల నిర్బంధాలను రికార్డు చేస్తున్నారు. ఇలా చూసినప్పుడు కెమెరా ఒకటే! చూసే దృష్టినిబట్టి దాని ప్రయోజనం ఉంటుంది. ఫొటోగ్రఫీ గురించి ఈ నలుగురూ ఏం చెబుతున్నారో విందాం!



ఆహార సేకరణపై కెమెరా కన్ను

ఐదు దశాబ్దాలుగా ఇదే వృత్తిలో ...




ఫొటోగ్రాఫర్‌గా వృత్తిలో రాణించటం ఏమాత్రం ఆషామాషీ వ్యవహారం కాదు. చేసే పనిపై గౌరవం, వృత్తి పట్ల అంకితభావం ఉంటేనే అది సాధ్యమవుతుంది. నేను 70 ఏళ్ల వయసులో కూడా ఫొటోగ్రాఫర్‌గా కొనసాగుతున్నానంటే దానిపై నాకున్న అభిమానం. సమాజం, ప్రభుత్వం, వ్యక్తులు, బాధ్యతలు, హక్కులు, అవహేళనలు, దూషణలు, దుర్మార్గాలు, అభివృద్ధి నిరోధక అంశాలు ఏవైనా దృశ్యరూపంగా నిలిచేలా ఫొటోలు తీసి వెలుగులోకి తేవటానికి శక్తివంచన లేకుండా కృషిచేశాను. ఈ ఐదు దశాబ్దాల కాలంలో అనేక అవార్డులు పొందాను. మరెన్నో బహుమతులు, కితాబులు, రివార్డులు సైతం అందుకున్నాను. నా బాటలోనే తనయుడు కె.ఆర్.దీపక్ ది హిందూ చీఫ్ ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్నందుకు సంతోషిస్తున్నా.

– కె.భాస్కరరావు, సీనియర్ ఫొటో జర్నలిస్ట్, విశాఖపట్నం



రెండు వ్యత్యాసాల బంధనం

ఫొటోగ్రఫీ నా హాబీ



ఫొటోగ్రఫీ నా హాబీ. చదువు, ఉద్యోగం, విశ్రాంత జీవితంలో కూడా నచ్చిన ఫొటోలను బంధిస్తూ కాలక్షేపం చేస్తున్నా. మైడ్రీమ్ 02, బ్లాక్ అండ్ వైట్‌లో హోమ్‌లెస్ సబ్ డాగ్, నేచర్‌లో కొన్ని బొమ్మలు వంటివి తీస్తున్నా. కలర్ సెక్షన్, మోనోక్రోమ్, నేచర్, ఫొటో ట్రావెల్, పీపుల్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ, ఫొటో జర్నలిజంలో నేను తీసిన పలు ఫొటోలకు బంగారు పతకాలు వచ్చాయి. ఆర్ట్ ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్నా. వివిధ ప్రాంతాల్లోని ఫొటోలు తీయటం, సేకరించటం ద్వారా వాటిని భద్రపరుస్తున్నా. దశాబ్దాలుగా ఫొటోలు తీయడం ఎన్నో దశలు దాటుతూ వస్తోంది. ఫొటోగ్రఫీకి ప్రధానంగా కావాల్సింది సృజనాత్మకత. దానిని పెంపొందించుకుంటే ఫొటోగ్రఫీ వృత్తిగా ఎంచుకున్న వారు కూడా రాణించగలరు.

– కొర్లపాటి సరస్వతిరావు
ఎస్‌బిఐ విశ్రాంత ఉద్యోగి, ఫొటోగ్రఫీలో బంగారు పతకాల విజేత, కాకినాడ.

దయనీయ జీవితాలపై డాక్యుమెంటేషన్



ప్రపంచంలోని పలు దేశాల్లో పర్యటించా. నాకు ట్రావెల్ ఫొటోగ్రఫీ అంటే ఎంతో ఇష్టం. ఆసియా, యురోపియన్, యుఎస్ఎ, ఇంగ్లాండ్, జపాన్, స్పెయిన్, నార్వే మొదలైన దేశాల్లో పర్యటించాను. ఆయా దేశాల్లోని ప్రజానీకం స్థితిగతులు, ఆర్థిక, చారిత్రక, రాజకీయ, భౌతికపరమైన పలు అంశాలపై ఫొటోగ్రఫీలో డాక్యుమెంటేషన్ చేశాను. స్పెయిన్ పౌరసత్వంతో అక్కడి పత్రికలకు ఫొటోగ్రాఫర్‌గా, పాత్రికేయుడిగా విధులు నిర్వహిస్తున్నా. ఐక్యరాజ్యసమితి పరిధిలోని యునిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే వయోజన విద్య కార్యక్రమాల్లో నన్ను భాగస్వామిని చేశారు. పలు దేశాల్లో పర్యటించి వివిధ తరగతుల ప్రజల జీవన విధానాలపై డాక్యుమెంటేషన్లు తయారుచేసి ఇస్తున్నాను. యుగోస్లేవియాలో అంతర్యుద్ధం జరిగిన తర్వాత ఆ దేశంలో పర్యటించా. అక్కడి భీతావహ దృశ్యాలు, మారణహోమం జరిగిన తీరు, అక్కడి ప్రాంతాల్లో శవాల గుట్టలు ఇలాంటి అనేక సన్నివేశాలను కెమెరాలో బంధించాను. నిరక్షరాస్యత, పేదరికం, ఆర్థిక అసమానతలు, వర్ణ వివక్ష, ఆధిపత్య ధోరణులపై ప్రభావవంత ఫొటోగ్రఫీ చేయడం నాకిష్టం.



కాలువ హొయలుపై విహంగవీక్షణం

– అశోక్ బీరా, స్పెయిన్ (ప్రవాస భారతీయులు, అంబేద్కర్ కోనసీమ జిల్లా)

సాహసోపేతమైన వృత్తిగా భావిస్తున్నా



నేను ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్లి అధునాతన కెమెరా కొనుక్కున్నాను. ఆ తర్వాత ప్రజాశక్తిలో ఫొటోగ్రాఫర్‌గా అవకాశం వచ్చింది. అప్పట్లో హైదరాబాద్ ఓల్డ్ సిటీ మల్లేపల్లెలో మతకలహాలు జరిగేవి. అది కవర్ చేస్తున్న సందర్భంలో కొందరు వ్యక్తులు నామీద దాడి చేశారు. కొంతమంది మీడియా మిత్రులు వచ్చి నన్ను కాపాడారు. అల్లరి మూకలు నా కెమెరాను సైతం ధ్వంసం చేశాయి. పరిటాల రవి హత్య సమయంలో వరంగల్‌లో కొంతమంది అల్లరి మూకలు బస్సులు ధ్వంసం చేస్తుండగా ఫొటోలు తీస్తున్న నాపై దాడిచేశాయి. అక్కడే ఉన్న ఎస్పీ స్టీఫెన్ రవీంద్ర బృందంతో వచ్చి నన్ను కాపాడారు. హైదరాబాద్‌లో గోకుల్ చాట్ లుంబిని పార్క్‌లో బాంబు బ్లాస్ట్ జరిగితే సంఘటనా ప్రదేశానికి వెళ్లి అక్కడ చిమ్మ చీకట్లో భీతావహ దృశ్యాలను కవర్‌చేశా. ప్రజాఉద్యమాల సమయంలో నిర్బంధాలు, అరెస్టులు, దమనకాండలపై సాహసోపేతంగా వ్యవహరించి ఫొటోలు తీశా.

– టి.వి.రమణ
ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టు, విజయవాడ



నిర్బంధంపై నిఘానేత్రం!

రాజ్య నిర్బంధాన్ని ప్రతిఘటించిన గద్దర్

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ప్రజా ఉద్యమ పోరాటాల్లో ప్రభుత్వాల రాజ్య నిర్బంధాన్ని ప్రతిఘటించిన వ్యక్తి గద్దర్ అని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. శుక్రవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కుల, మత, ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా పాటల ద్వారా ప్రజల అభిమానాన్ని చూరగొన్న గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ప్రజల్లో ఉన్న బాణీలు, స్పందన, నుడికారాలు, కష్టాలు, ఆవేశాలు నుంచి వచ్చిన భావాలనే గద్దర్ పాటల, రచనల రూపంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. వెన్నులో తుపాకి గుండును దాచుకుని ఎన్నడూ గొంతు విప్పడం ఆపలేదని తెలిపారు. విప్లవోద్యమంలో వచ్చిన ఒడిదుడుకులను పరిశీలించకుండా కొంతమంది గద్దర్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు గద్దర్ తెలంగాణ పక్షాన నిలిచారాన్నారు. ప్రజల్లో విప్లవ చైతన్యం తీసుకురావాలంటే పాటలు ద్వారానే సాధ్యమని గద్దర్ భావించారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మత విద్వేష రాజకీయాలు చేస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే దుర్మార్గ ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మణిపూర్‌లో 60 వేల మంది కుకీలు తమ ప్రాంతాన్ని విడిచిపెట్టి వెళ్లడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుకుంటున్నాయన్నారు. ఖనిజ వనరులను అదానీకి అప్పగించే ప్రయత్నంలో భాగంగానే మణిపూర్‌లో అల్లర్లు, గిరిజనులపై దాడులు చేస్తున్నారన్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం లేని, తీవ్ర అణచివేతతో కూడిన రాజ్యాంగాన్ని అంటే మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని బిజెపి యత్నిస్తోందన్నారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడమే గద్దర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అని ఆయన చెప్పారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. గద్దర్ లేని లోటు ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి తీరనిదని, ప్రజల పాటల్లో, కళారూపాల్లో గద్దర్ ఎన్నటికీ నిలిచి ఉంటారని తెలిపారు. అరసం నాయకులు అజయ్ మాట్లాడుతూ.. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ లేనట్టయితే ఈనాటి గొప్ప కళారంగం ఏర్పడి ఉండేదికాదని అన్నారు. పార్టీ నిర్మాణంలో సృజనాత్మకత శక్తి ఆధారపడి ఉన్నదని, అది గద్దరుకే వర్తించిదని తెలిపారు. గద్దర్ మాట, పాట, రచన వెనుక అనేక త్యాగాల పరంపర ఉన్నదన్నారు. భారతీయ కళా రంగానికి, పాటకు చిరునామా గద్దర్ అని అన్నారు. సభ ప్రారంభానికి ముందు గద్దర్ చిత్రపటానికి సీనియర్ గాయకులు జగన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు కవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, కార్యదర్శి అప్పన్న, కృష్ణా జిల్లా అధ్యక్షులు కొండల బాబు, కార్యదర్శులు షేక్ ఖాసిం, విరసం నాయకులు అరసవెల్లి కృష్ణ, అరసం నాయకులు పరుచూరి అజయ్, కొప్పుల అశోక్, హృదయరాజు, ఎస్‌కె హనీఫ్ తాజారావు, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, డివి రాజు తదితరులు పాల్గొన్నారు.

తొలి పరీక్షలో నెగ్గిన బుమ్రా

- ఐర్లాండ్‌పై రెండు పరుగుల తేడాతో టీమిండియా గెలుపు



డంబ్లిన్: ఐర్లాండ్‌తో జరిగిన తొలి టి20లో టీమిండియా రెండు పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఐర్లాండ్ నిర్దేశించిన 140పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచే సమయానికి భారతజట్టు 6.5ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 47పరుగులు చేసింది. ఆ తర్వాత భారీ వర్షం కురవడం, మ్యాచ్ జరిగే పరిస్థితి లేకపోవడంతో డిఎల్‌ఎస్ పద్ధతిపై టీమిండియా 2 పరుగుల తేడాతో గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. తొలుత టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ బుమ్రా తొలుత బౌలింగ్‌కే మొగ్గుచూపాడు. దీంతో ఏడాదిన్నర తర్వాత మైదానంలోకి దిగిన జస్ప్రీత్ బుమ్రా 2వ బంతికి బల్‌బోర్నీ(4), 5వ బంతికి టక్కెర్(0)లను ఔట్ ఐర్లాండ్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. మొత్తం 4ఓవర్ల కోటాలో 24పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. ప్రసిధ్ కృష్ణ, ఆర్షదీప్‌కి తోడు స్పిన్నర్ రవి బిష్ణోయ్ కూడా పొదుపుగా బౌలింగ్ చేయడంతో ఐర్లాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 139పరుగులు చేసింది. తొలుత ఐర్లాండ్ జట్టు 27పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత మార్క్ అడైర్(16) మిడిలార్డర్‌లో కర్టిస్ కాంఫర్(39) బ్యాటింగ్‌లో రాణించారు. ఆ తర్వాత ఐర్లాండ్ జట్టు 59 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన పీకల్లోతు కష్టాల్లో ఉన్న దశలో బ్యారీ మెకార్తీ అద్భుత ఇన్నింగ్స్‌తో అలరించాడు. కేవలం 33 బంతుల్లో 4ఫోర్లు 4సిక్సర్లతో అజేయంగా 51 పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి మెకార్తీ సిక్స్ బాది అర్ధసెంచరీ మార్కు అందుకున్నాడు. దీంతో ఐర్లాండ్ జట్టు గౌరవప్రద స్కోర్ చేసింది. బుమ్రా, ప్రసిధ్, బిష్ణోయ్‌కు రెండేసి, ఆర్షదీప్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బుమ్రాకు లభించింది.

స్కోర్‌బోర్డు..

ఐర్లాండ్ ఇన్నింగ్స్: బల్‌బోర్నీ (బి)బుమ్రా 4, స్టెర్లింగ్ (బి)బిష్ణోయ్ 11, టక్కెర్ (సి)సంజు (బి)బుమ్రా 0, హారీ టెక్టర్ (సి)తిలక్ వర్మ (బి)ప్రసిధ్ 9, చాఫర్ (బి)ఆర్షదీప్ 39, డోక్రెల్ (సి)గైక్వాడ్ (బి)ప్రసిధ్ 1, అడైర్ (ఎల్‌బి)బిష్ణోయ్ 16, మెక్ కర్తీ (నాటౌట్) 51, యంగ్ (నాటౌట్) 1, అదనం 7. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 139పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/4, 3/27, 4/27, 5/31, 6/59, 7/116, **బౌలింగ్:** బుమ్రా 4-0-24-2, ఆర్షదీప్ 4-0-35-1, ప్రసిధ్ 4-0-32-2, రవి బిష్ణోయ్ (4-0-23-2, శివమ్ దూబే 1-0-6-0, వాషింగ్టన్ సుందర్ 3-0-19-0

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి)స్టెర్లింగ్ (బి)యంగ్ 24, గైక్వాడ్ (బ్యాటింగ్) 19, తిలక్ వర్మ(సి)టక్కెర్ (బి)యంగ్ 0, సంజు(నాటౌట్) 1, అదనం 3. (6.5ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 47పరుగులు. **వికెట్ల పతనం:** 1/46, 2/46

బౌలింగ్: మార్క్ అడైర్ 1-0-10-0, జోషూ లిట్టిల్ 3-0-20-0, మెక్ కర్తీ 2-0-14-0, యంగ్ 0.5-0-2-2.

ప్రజా సమస్యలు పట్టని వైసిపి సర్కారు

- వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించాలి
- టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమలాపురం

వైసిపి ప్రభుత్వానికి రాష్ట్ర సమస్యలు పట్టడం లేదని, ఈ సమస్యలపై కేంద్రం వద్ద వైసిపి ఎంపిలు నోరువిప్పడం లేదని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. భవిష్యత్తు గ్యారంటీ యాత్రలో భాగంగా శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అమలాపురంలోని గడియారస్తంభం సెంటర్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కడప స్టీల్ ప్లాంటు ఏమైంది? విశాఖకు రైల్వే జోన్ వచ్చిందా?, రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో వైసిపి ఎంపిలు ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించాలని కోరారు. రాష్ట్రంలో ఇసుకాసురులు ఎక్కువయ్యారని, సామాన్య ప్రజలకు ఇసుక దొరికే పరిస్థితి లేదన్నారు. తిరుమలలో పులులంటే యాత్రికులకు కర్రలు ఇస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. ఇంటికో కర్ర పట్టుకుని ముందుగా ఈ వైసిపి దొంగలను తరిమికొట్టాలని కోరారు. బాబాయ్ హత్య కేసులో తమ్ముడిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి హత్యా రాజకీయాలు తనకు చేతకాదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ రాసే మీడియాపై సైతం దాడులు చేస్తున్నారని విమర్శించారు. దళితులపై ముఖ్యమంత్రికి ప్రేమ లేదని, స్థానిక దళిత మంత్రిని గోడ కుర్చీ వేయించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఓ ఎమ్మెల్సీ అయితే దళిత యువకుడిని చంపి, మృతదేహాన్ని ఇంటికి డోర్ డెలవరీ చేసి.. నేడు దర్జాగా తిరుగుతున్నాడని విమర్శించారు. కొబ్బరి రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొబ్బరి రైతుకు పూర్వ వైభవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తొలుత ఆయన అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో రైతులు, వైద్యులు, న్యాయవాదులు, మేధావులు, మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రాభివృద్ధికి, ఉపాధి కల్పనకు, పలువురు ఇచ్చిన సూచనలను చంద్రబాబు స్వీకరించారు. అనంతరం బాలయోగి ఘాట్‌ను సందర్శించి, బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గంగి హరీష్‌మాథూర్ పాల్గొన్నారు.



అమలాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

మావోయిస్టు నేత రాజిరెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డి (70) అలియాస్ సంగ్రామ్ అనారోగ్యంతో కన్నుమూశారు. దండకారణ్యంలో ఆయన మృతిచెందినట్లు పేర్కొంటూ మావోయిస్టులు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. తెలంగాణలోని కరీంనగర్ జిల్లాకు చెందిన రాజిరెడ్డి తొలితరం మావోయిస్టు నేతల్లో ఒకరు. అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌లతో కూడిన మావోయిస్టుల నైరుతి ప్రాంతీయ బ్యూరోలో విప్లవాత్మక ఉద్యమానికి ఇన్‌ఛార్జిగా ఆయ న పని చేశారు. వివిధ రాష్ట్రాల్లో ఆయనపై రూ.కోటి రివార్డు ఉంది. కొండపల్లి సీతారామయ్య, గణపతి, సత్యమూర్తిలకు రాజిరెడ్డి సహచరుడు. ఉమ్మడి ఎపి మాజీ స్పీకర్ శ్రీపాదరావు హత్య కేసులో నిందితుడిగా ఉన్నారు. 2008 జనవరిలో కేరళలో రాజిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రాన్సిట్ వారెంట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. వివిధ కేసుల్లో నిందితుడిగా రెండున్నరేళ్లు కరీంనగర్ జైలులోఉన్నారు. రాజిరెడ్డి మరణాన్ని ధ్రువీకరించి తమకు అప్పగించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. రాజిరెడ్డి స్వస్థలం పెద్దపెల్లి జిల్లా మంథని మండలంలోని శాస్త్రులపల్లి.

చంద్రుడిపై పలు బిలాలు !

బెంగళూరు : అంతరిక్ష నౌక చంద్రయాన్-3లో ప్రొపల్షన్ మాడ్యూల్ నుండి విడివడిన ల్యాండర్ మాడ్యూల్‌కు శుక్రవారం డీ బూస్టింగ్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. డీ బూస్టింగ్ అంటే చంద్రుని చుట్టూ తిరిగే కక్ష్య వేగాన్ని తగ్గించడమే. ప్రస్తుతం ల్యాండర్ మాడ్యూల్ కక్ష్యని చంద్రుని ఉపరితలానికి మరింత దగ్గరగా 113కిమీ-157కిమీ. కి తగ్గించినట్లు ఇస్రో ఎక్స్ (పూర్వపు ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. తిరిగి 20వ తేదీన తెల్లవారు జామున 2గంటలకు రెండో డీ బూస్టింగ్ ఆపరేషన్‌ను నిర్వహించనున్నట్లు ఇస్రో తెలిపింది. 23వ తేదీన సాయంత్రం 5.47గంటల సమయంలో చంద్రుని ఉపరితలంపై ల్యాండర్ దిగే అవకాశం వుందని భావిస్తున్నట్లు ఇస్రో పేర్కొంది. గురువారం ప్రొపల్సన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్ రెండు విజయవంతంగా విడిపోయి తమ తమ నిర్దేశిత ప్రయాణాలు ఆరంభించాయి. చంద్రయాన్-3 పంపించిన చంద్రునిపై రెండు వీడియోలను ఇస్రో శుక్రవారం విడుదల చేసింది. ల్యాండర్ పొజిషన్ డిటెక్షన్ కెమెరా (ఎల్‌పిడిసి)తో ఈ నెల 15న మొదటి వీడియోను తీసింది. 17వ తేదీన ప్రొపల్షన్ మాడ్యూల్ నుండి ల్యాండర్ విడిపోయిన వెంటనే ల్యాండర్ ఇమేజర్ కెమెరా-1 చంద్రుడి వీడియో ఒకటి తీసి పంపింది. ఇందులో చంద్రుడి ఉపరితలాన్ని, బిలాలను స్పష్టంగా చూపిస్తున్న పలు విజువల్స్ వున్నాయి. ఆ ఫోటోల్లో కనిపించే బిలాలను ఫాబ్రీ, గార్డనో బ్రూనో, హర్కెబీ జె పేర్లతో ఇస్రో పేర్కొంది. చంద్రయాన్-3ని ప్రయోగించిన తర్వాత ఇస్రో మూడు వీడియోలను విడుదల చేసింది.

లూనా-25వ మొదటి ఫోటో

రష్యా పంపిన ఆటోమేటిక్ ఇంటర్‌ప్లానెటరీ స్టేషన్ లూనా-25 చంద్రుని ఆవల వైపున గల ధృవ బిలాన్ని ఫోటోలు తీసి భూమికి పంపించిందని రష్యా అంతరిక్ష సంస్థ గురువారం వెల్లడించింది. విస్తారమైన జీమన్ బిలానికి సంబంధించిన పలు చిత్రాలు ఇందులో వున్నాయి. చంద్రుని ఉపరితలం కన్నా దాదాపు 8కిలోమీటర్లు ఎత్తున పైకి లేచిన పక్షాలతో ఈ బిలం కనిపిస్తోంది. ఈ ప్రాంతం భూమికి దూరంగా వుండడంతో ఖగోళ శాస్త్రవేత్తలకు ఇది కనిపించదు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68